

వరద నీటి ముంపులో నరసరావుపేట పట్టణం (పాత చిత్రం)

నరసరావుపేటలో జమ్ముతో, వ్యర్థాలతో పూడిపోయిన ప్రధాన వరద నీటి కాలువలు


నరసరావుపేటలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు

పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పురపాలక సంఘాల్లో వేసవి ప్రణాళికలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపుకు గురవ్వకుండా వరద నీటి, ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత చేపట్టాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపుకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో వరద నీటి కాలువలను అభివృద్ధి చేయాలి. వర్షాలు కురిస్తే ఈ పనులు చేపట్టేందుకు వీలుండదు. అయినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

మేల్కోకుంటే.. మునకే!

- వర్షాకాలం ముందస్తు చర్యలు శూన్యం
- పూడి పోయిన వరద నీటి కాలువలు
- పూడిక తీతకు నోచుకోని వైనం
- భారీ వర్షం కురిస్తే పల్లపు ప్రాంతాలు మునకే
- చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలు కురిస్తే ఉమ్మడి జిల్లాల్లోని పట్టణాల్లో పల్లపు ప్రాంతాలు ఏటా ముంపుకు గురవుతున్నాయి. వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టడాన్ని పురపాలకులు విస్మరిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకొని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించ కుండా పూర్తిస్థాయి చర్యలు మునిసిపాలిటీల్లో చేపట్టాల్సి ఉంది. ఈ దిశగా మునిసిపల్ అధికారులు స్పందించటం లేదు. వర్షా కాలం తరుముకొస్తున్నా పురపాలకులు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదు. ప్రతి మునిసిపాలిటీలో ఉన్న వరద నీటి కాలువలు, ప్రధాన మురుగు కాలువల్లో వర్షా కాలానికి ముందుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. పూడిపోయిన కాలువలను పునరుద్ధరించాలి. వరద నీరు సులువుగా కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రధాన మురుగు కాలువల్లో ప్రారంభం నుంచి చివరి వరకు పూడిక తీయాలి. వరద నీటి కాలువల్లో పెరిగిన జమ్ము, నాచు తొలగించాలి. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా కాలువలను అభివృద్ధి చేయాలి. ఇందు కోసం మునిసిపాలిటీలు ప్రత్యేక నిధులు కేటాయించాలి. వేసవి కాలం ముగియ బోతున్నా సదరు పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పురపాలకుల్లో చలనం లేదు..

జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తుంటాయని తెలిసినా పురపాలకుల్లో చలనం లేదు. ఇంజనీరింగ్, ప్రణాళికా, పారిశుధ్య విభాగాల అధికారులు కమిటీగా ఏర్పడి సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది. కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలి. సదరు విభాగాల అధికారులు వరద నీటి కాలువల్లో పూడిక తీత పనులు, పగిలి పోయిన కట్టడాల పునరుద్ధరణ చేపట్టేందుకు ఇంకా మునిసిపాలిటీలలో సమాయత్తం కాకపోవటం గమనార్హం. ఈ ఏడాదైనా ఈ పరిస్థితుల నుంచి పేదలను గట్టెక్కించేందుకు ఇప్పటికైనా వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టే అంశంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి. నగర పంచాయతీలు, ఏ ఒక్క మునిసిపాల్టీలో కూడా ఈ పనులు చేపట్టలేదు. వర్షాకాలం ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. వర్షాలు కురిసే సమయంలో పనులు చేసే పరిస్థితి ఉండదు.

వెంటాడుతున్న నిధుల కొరత...

మునిసిపాల్టీల్లో నిధుల కొరత వెంటాడుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదు. ఉద్యోగుల జీతాల చెల్లింపు కటకటలాడుతోంది. ఎన్నికల నేపథ్యంలో పన్ను వసూళ్ల పూర్తి స్థాయిలో జరగలేదు. ప్రభుత్వం వరుసగా నాలుగేళ్ల పన్ను పెంచడంతో కొత్త ప్రభుత్వం వస్తే పెంచిన పన్నులు తగ్గిస్తారన్న భావనతో పన్నులు చెల్లించేందుకు పురాల పౌరులు ముందుకు రాలేదు. దీంతో మునిసిపాల్టీల ఖజానాలు నిండుకున్నాయి. దీంతో వర్షాకాలం మందుస్తు చర్యలు తీసుకోవడంలో అలసత్వం నెలకొంది. కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో సదరు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా లేరు. ఈ నేపథ్యంలో వరద నీటి కాలువల్లో పూడికతీత చేపట్టడం లేదు.

మురుగు కాల్వలను కబ్జా చేశారు..

వరద నీటి కాలువలు మునిసిపాల్టీలలో ఆక్రమణలకు గురయ్యాయి. అధికారం అండతో కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏ ఒక్క మునిసిపాల్టీలో కూడా కాల్వలపై ఆక్రమణలు తొలగింపునకు ప్రయత్నాలు జరగడం లేదు. కాలువల కబ్జాదారులపై చర్యలు లేకపోవడంతో వారు రెచ్చిపోతున్నారు. మునిసిపాల్టీల రికార్డుల్లో నమోదైన ప్రకారం కాలువల విస్తీర్ణం లేదు. భారీ షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వాహకులు వారి షాపుల ముందు ఉన్న కాలువలపై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తూ వాటిని కబ్జా చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ప్రణాళికా విభాగాలు చోద్యం చూస్తున్నాయి. ఆక్రమణలతో కాలువలు కుంచించుకు పోయాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే వరద నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పల్లపు ప్రాంతాల్లోని గృహాలు ముంపునకు గురవుతున్నాయి. వరద నీటి కాలువలను పునరుద్ధరించకుంటే వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ముంపు కష్టాలు తప్పవు.


కారంపూడిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి, మూతపడ్డ దుకాణాలు


మాచర్ల పార్కు సెంటర్లో దుకాణాలను మూసివేయిస్తున్న పోలీసులు


మాచర్ల : నెహ్రూనగర్‌లో ముళ్ల కంచె ఏర్పాటుచేసి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు


పిన్నెల్లిలో వైసీపీ నేత ఇంట్లో లభ్యమైన పెట్రోలు బాంబులు



ముప్పాళ్ల: మాదల వైసీపీ నాయకుడు గుంటూరు సైదా నివాసంలో సోదాలు జరుపుతున్న సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ హజరత్తయ్య. ఆయన ఇంట్లో దొరికిన పెట్రో బాంబులు

పల్నాట.. పోలీసుల పహారా

- జిల్లాలో కొనసాగుతున్న 144 సెక్షన్
- నిర్మానుష్యంగా వీధులు.. దుకాణాల మూత
- ఎక్కడికక్కడ పోలీసు పికెట్లు.. ఇళ్లల్లో తనిఖీలు
- వైసీపీ నేతల ఇళ్లల్లో పెట్రో బాంబులు స్వాధీనం
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

మాచర్లటౌన్, కారంపూడి, ముప్పాళ్ల, మాచవరం, పిడుగురాళ్ల, మే 16: పోలింగ్ అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చిన్న అలికిడి అయినా భీతిల్లిపోతున్నారు. పట్టణాలు, పల్లెలు పోలీసు పహారా మధ్య ఉన్నాయి. జిల్లా అంతటా 144 సెక్షన్ గురువారం కూడా కొనసాగింది. దుకాణాలను పోలీసులు తెరవనీయలేదు. దీంతో జిల్లా అంతటా అప్రకటిత కర్ఫ్యూ అమలవుతుంది. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ వీధులు జనసంచారం లేకపోవడంతో నిర్మానుష్యంగా మారాయి. రెండు రోజులుగా ఎటువంటి అల్లర్లు జరగలేదు. అయినా ఇరువర్గాల వారు ఏ సమయంలోనైనా దాడులకు పాల్పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నారు. అనుమానితుల గృహాల్లో సోదాలతో పాటు ఎక్కడికక్కడ పికెట్లు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. అదనపు బలగాలతో పికెట్లు కొనసాగుతున్నాయి. మాచర్లలో బందోబస్తు నిమిత్తం తమిళనాడు నుంచి 110 మందితో కూడిన పోలీసు బలగాలను గురువారం మాచర్లకి రప్పించారు. పట్టణంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు ఐదుగురు, సీఐలు ఏడుగురు, ఎస్ఐలు 22 మంది, ఏఎస్ఐలు నలుగురు, హెడ్ కానిస్టేబుళ్లు 11, పోలీసు కానిస్టేబుళ్లు 40, హోంగార్డులు 101, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు 77 మంది, సీఐఎస్ఎఫ్ 90 మంది, ఏపీఎస్పీ 21 మంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని మొత్తం ఐదు మండలాల్లో సుమారు 1000 మంది పోలీసు బలగాలు మోహరించాయి.

పిన్నెల్లి, మాదలలో పెట్రో బాంబులు స్వాధీనం

వైసీపీ నేతల ఇళ్లల్లో పెట్రో బాంబులు, కత్తులు, రాళ్లు, ఖాళీ బీరుసీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరికొన్ని చోట్ల కూడా బాంబులు ఉండే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. వైసీపీ నాయకులు ఆధిపత్యం కోసం టీడీపీ వారిని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నంలోనే ఈ పెట్రోలు బాంబులు, మారణాయుధాలు సిద్ధం చేసుకున్నట్లు అటు పోలీసులతో పాటు ఇటు సామాన్య ప్రజలు భావిస్తున్నారు. ముందస్తు సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో ఇంటింటా సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులైన చింతపల్లి పెద్దసైదా, చింతపల్లి నన్నే గృహాల్లో పెట్రో బాంబులు బయటపడ్డాయి. టీడీపీ నాయకులైన షేక్ జానీబాష ఇంటిపైన గులకరాళ్లను పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు వైసీపీకి చెందిన ముగ్గుర్ని, టీడీపీకి చెందిన ముగ్గుర్ని బుధవారం రాత్రే అదుపులోకి తీసుకున్నారు. ముప్పాళ్ల మండలం మాదలలో పోలీసు తనిఖీల్లో వైసీపీ నాయకుడు గుంటూరు సైదా ఇంట్లోని బాత్‌రూంలో 29 పెట్రోల్ బాంబులను గుర్తించారు. సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ హజరత్తయ్య గురువారం వీటిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ బిందుమాధవ్ మాచర్లలో తిష్ట వేసి పోలీసు బృందాలకు సూచనలు చేస్తున్నారు. రింగురోడ్డు, పురపాలక సంఘం కార్యాలయం ప్రధాన రహదారి, నెహ్రూనగర్‌లలో ముళ్ల కంచెలు వేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

నిందితుల కోసం గాలింపు..

మంగళవారం కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి చేసిన వైసీపీ గూండాల కోసం పోలీసులు ప్రత్యేక బలగాలను దింపి గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని ప్రతి గ్రామంలో సోదాలు చేస్తున్నారు. దీంతో దాడులకు పాల్పడిన రౌడీ మూకలు గ్రామాల నుంచి పారిపోయారు. పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణ, విధ్వంసాలకు పాల్పడిన వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మాచర్ల పట్టణంతోపాటు గ్రామాలను జల్లెడ పడుతున్నారు.

ప్రజలు విలవిల

మంగళవారం నాటి సంఘటనలతో జిల్లా అంతటా 144 సెక్షన్ కొనసాగుతుంది. దీంతో పోలీసులు దుకాణాలను తెరవనీయడం లేదు. రెండు రోజులుగా బయటకు అడుగుపెట్టేందుకు ప్రజలు భీతిల్లిపోతున్నారు. నిత్యావసరాలకు, తాగునీటికి సైతం విలవిల్లాడుతున్నారు. బయటకు వెళ్లి ఏం తెచ్చుకోవాలన్నా భయంతో ఉన్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చిన్న చిన్న వ్యాపారులపై ఆంక్షలు సడలించినా పూర్తిస్థాయిలో నిత్యావసర వస్తువులు అందడం లేదు. ఇదే అదునుగా వ్యాపారులు అధిక రేట్లకు అమ్ముతున్నారు. 144 సెక్షన్ ఇంకెంత కాలం కొనసాగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సీఎంవోకు పిన్నెల్లి సోదరులు..

తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలు గురువారం పోలీసు ఎస్కార్ట్‌తో వెళ్లారు. శుక్రవారం విదేశాలకు వెళ్లనుండడంతో జగన్‌ను కలిసేందుకు సోదరులిద్దరూ వెళ్లారు.


శివశంకర్ లోతేటి

8 మందిపై వేటు

- అడ్డగోలు అధికారులపై ఈసీ కొరడా
- కలెక్టర్ బదిలీ.. ఎస్పీ సహా ఆరుగురి సస్పెన్షన్
- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఫలితం
- ఈ స్థాయిలో చర్యలు ఇదే ప్రథమం.. ఉలిక్కిపడిన యంత్రాంగం


ఎస్పీ బిందుమాధవ్


నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ


గురజాల డీఎస్పీ ఏ పల్లపురాజు


సీఐ కే ప్రభాకరరావు


సీఐ ఈ బాల నాగిరెడ్డి


కారంపూడి ఎస్ఐ రామాంజనేయులు


విజయపురి సౌత్ ఎస్ఐ డీవీ కొండారెడ్డి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఎలా ఉంటాయో ఎన్నికల కమిషన్ రుచి చూపించింది. అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులపై కొరడా ఝుళిపించింది. కలెక్టర్ శివశంకర్‌ను బదిలీ చేయగా ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు ఎస్పీ సీఐలు, ఇద్దరు ఎస్ఐలను సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఎన్నికల సంఘం ఉత్తర్వులను విడుదల చేసింది. ఈసీ వేటు పడిన వారిలో గురజాల, నరసరావుపేట డీఎస్పీలు పల్లపరాజు, వీఎస్ఎన్ వర్మ, డీఎస్పీ సీఐలు ప్రభాకరరావు, బాలనాగిరెడ్డి, కారంపూడి, నాగార్జునసాగర్ ఎస్ఐలు రాంజనేయులు, కొండారెడ్డి ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒకేసారి ఇంతమందిపై చర్యలు తీసుకోవడం ఇదే ప్రథమం. ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులపై తీసుకున్న చర్యలు సంచలనం కలిగించాయి.

ఈసీ ఆదేశించినా అలసత్వం..

రాష్ట్రంలో అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాలను గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల సంఘం పోలింగ్‌కు ముందే నిర్దేశించింది. వాటిలో పల్నాడు జిల్లా పరిధిలోనే నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఎటువంటి చర్యలు తీసుకోవాలో గతంలోనే ఎన్నికల సంఘం సూచించింది. పోలింగ్ రోజున అరాచకాలు రాజ్యమేలుతాయని ముందుగానే కమిషన్ హెచ్చరించింది. అయినా జిల్లా ఎన్నికల యంత్రాంగం అలసత్వాన్ని వీడలేదు. అరాచకాలు జరగకుండా అడ్డుకోవడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఇందుకు తగిన మూల్యం అధికారులు చెల్లించుకున్నారు. మాచర్ల, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలో గత ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా అరాచక శక్తులు రెచ్చిపోయి, భారీగా విధ్వంసాలు సృష్టించాయి. టీడీపీ ఏజెంట్లపై దాడులు, మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిపై హత్యాయత్నం, పదుల సంఖ్యలో కార్ల ధ్వంసం, కార్ల దహనం, ఐదు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంల ధ్వంసం, పెట్రో బాంబులతో దాడులు ఇలా అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసు నిఘా వ్యవస్థ కూడా అరాచకాలకు సంబంధించి ముందస్తు సమాచారం సేకరించడంలో విఫలమైంది. ముందు నుంచి ప్రతిపక్షాలు అనుమానించిన విధంగానే విధ్వంసాలు జరిగాయి. పల్నాడులోని పరిస్థితులపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాల రూపంలో హెచ్చరించినా అధికారుల్లో చలనం లేదు. యంత్రాంగం నిర్లక్ష్యం ఫలితంగా పోలింగ్ తర్వాత కూడా అరాచకాలు రాజ్యమేలాయి. వందల సంఖ్యలో వైసీపీ మూకలు ఇనుప రాడ్లతో రోడ్డెక్కినా పోలీసులు నిరోధించలేకపోయారు. కారంపూడి విధ్వంసంలో పిన్నెల్లి వెంట్రామిరెడ్డి స్వయంగా పాల్గొన్నారు. దాడుల్లో వందల సంఖ్యలోనే గాయపడ్డారు. కారంపూడిలో ఏకంగా సీఐపైనే పిన్నెల్లి గ్యాంగ్ దాడి చేసి గాయపరిచింది. ఈ ఎన్నికల్లో పెట్రో బాంబులను వినియోగించారు.

రూ.5 కోట్లకు డీల్..

ఎన్నికల నిర్వహణలో అధికార పార్టీ అభ్యర్థులకు సహకరించేలా రూ.5 కోట్లకు డీల్ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే వైసీపీకి అనుకూలంగా పనిచేసేలా అధికారులను నియమించేందుకు డీల్ చేసుకున్నట్లు సమాచారం. బొప్పూడి వద్ద జరిగిన ప్రధాన మోదీ సభకు భద్రత కల్పించడంలో విఫలమవడంతో అప్పటి ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని బదిలీ చేశారు. అయితే అంతకముందే మాచర్లతో పాటు పలు నియోజకవర్గాలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించేలా కొందరూ పోలీసు అధికారులను నియమించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని బలపరుస్తూ ఆ తర్వాత కూడా జిల్లాలో యథేచ్ఛగా దాడులు, దౌర్జన్యాలు కొనసాగాయి. పోలింగ్ రోజు, ఆ తర్వాత రోజు అవి తారాస్థాయికి చేరాయి. ఈ పరిస్థితులను ఉపేక్షించిన ఎన్నికల సంఘం ఏకంగా డీజీపీ, సీఎస్‌లను వివరణ కోరి మరీ తాజాగా అధికారులపై చర్యలు తీసుకుంది. కోడ్ వచ్చిన తర్వాత నుంచి జిల్లాలో ఇప్పటి వరకు కలెక్టర్, ఇద్దరు ఎస్పీలు సహా ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. ఈ చర్యలతోనైనా ఎన్నికల యంత్రాంగంలో మార్పు వస్తుందో లేదో చూడాలి. కొత్త కలెక్టర్‌ను నియమించే వరకు జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా, ఇన్‌చార్జి ఎస్పీగా ఏఎస్పీ వీ రాఘవేంద్రరావు వ్యవహరించనున్నారు.

సైన్స్ విద్యార్థుల కోసం

టెన్త్, ఇంటర్ తరవాత What Next

(నిన్నటి పేజీ తరువాయి)



ఫిషరీస్

సైన్స్, ఆర్ట్స్, బిజినెస్‌ను ఒక్కచోట చేరిస్తే అది ఫిషరీస్‌గా చెప్పవచ్చు. ప్రపంచంలో మత్స్య సంపదను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న మూడో అతిపెద్ద దేశం భారత్. మన దేశానికి 7500 కిలోమీటర్ల విశాలమైన సముద్ర తీరం ఉంది. దీనితోపాటు దేశంలో కూడా అపారమైన నీటి వనరులు ఉన్నాయి. వీటన్నింటి కారణంగా ఈ రంగంలో అవకాశాలు విస్తారంగా కనిపిస్తాయి. ఫిషరీస్ రంగంలో ఉద్యోగాల విషయానికి వస్తే ఫామ్ మేనేజర్లు, హేచరీ మేనేజ్‌మెంట్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ - ప్రాసెసింగ్, ఫిషరీ ఇన్‌స్పెక్టర్, ఫిషరీ వర్కర్ తదితరాలు ప్రధానంగా ఉంటాయి. ఫిషరీ రంగంలోని టెక్నికల్ ఫీల్డ్‌లోకి వెళ్లాలనుకునేవారు బైపీసీతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. తెలుగు రాష్ట్రాల్లో ఏపీకి సంబంధించి ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఉంది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఉన్న ఫిషరీష్ కాలేజీకి ఎంతో చరిత్ర ఉంది.
తెలంగాణలోని పీవీనరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో కూడా ఒక కాలేజీ ఉంది.

డెయిరీ టెక్నాలజీ

భారత దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో డెయిరీ ఒకటి. ప్రపంచ పశు సంపదలో భారత్ వాటా ఎక్కువే. మన దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెడుతున్న రంగాల్లో డెయిరీ కూడా ఒకటి. అయితే ఈ రంగం ఇప్పటికీ సంప్రదాయ వ్యక్తుల చేతుల్లోనే ఉంది. చైనా, మెక్సికో లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇందులో దూసుకుపోతుంటే మనం మాత్రం కొంత వెనకబడి ఉన్నామని చెప్పుకోక తప్పదు. మన దేశంలోని కొన్ని సంస్థలు డెయిరీ టెక్నాలజీలో కోర్సులను అందిస్తున్నాయి. చాలావాటిలో చేరడానికి ఇంటర్ పూర్తి చేసినవారు అర్హులు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఏపీ- తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తెలంగాణ - హైదరాబాద్ (రాజేంద్రనగర్)లోని పీవీ నరసింహారావు తెలంగాణ స్టేట్ వెటర్నరీ యూనివర్సిటీ డైరీ టెక్నాలజీలో కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీ



ఇంటర్ బైపీసీతో పూర్తి చేసినవారు ఎంబీబీఎస్ కోర్సులో చేరవచ్చు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు మెడిసిన్, డెంటల్ కోర్సుల్లో చేరాలంటే 'నీట్' ర్యాంకు తప్పనిసరి. నాలుగున్నర సంవత్సరాల ఎంబీబీఎస్ కోర్సు మూడు ఫేజులు, తొమ్మిది సెమిస్టర్లుగా ఉంటుంది. సాధారణంగా ఒక్కో సెమిస్టరుకు 120 వర్కింగ్ డేస్ గ్యాప్ ఉంటుంది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ప్రతీ విద్యార్థి 12 నెలల ఇంటర్న్‌షిప్‌నకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రధానంగా ఈ కింది రకాల మెడిసిన్ శాఖలు ఉంటాయి.

- మెడిసిన్(అల్లోపతి) అండ్ డెంటిస్ట్రీ,
- హోమియోపతి
- ఆయుర్వేద
- యునాని
- నేచురోపతి

ఈ కోర్సులను అందించే సంస్థల వివరాలు వెబ్‌పేజీలో...

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KN1r9lc లో చదవండి.

- ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ డెస్క్

(ఎంపిక చేసిన కొన్ని కాలేజీల లిస్టును మాత్రమే ఇక్కడ ప్రచురించాం. పూర్తి వివరాల కోసం గూగుల్ సెర్చ్ చేయగలరు.)

దిక్సూచి DIKSUCHI

ఫార్మసిస్టులు

టెన్త్, ఇంటర్ అర్హతలతో ఫార్మసీలో డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సులు చేయవచ్చు. భారతదేశంలో ఫార్మసీ ఇండస్ట్రీ వంద సంవత్సరాల పురాతనమైనది. దేశవ్యాప్తంగా 25,000కు మించి మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిలో ఐదోవంతు బల్క్ డ్రగ్ యూనిట్లే. ఎంపిసి లేదా బైపీసీతో ఇంటర్ పూర్తిచేసినవారు నాలుగు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ(బిఫార్మసీ) కోర్సులో చేరడానికి అర్హులు. స్వయం ఉపాధి కోసం మెడికల్ షాపుల నిర్వహణ లేదా ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల ఉద్యోగాల అర్హతల కోసం రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు. బిఫార్మసీ చేసినవారు మాస్టర్స్ ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు.

అగ్రికల్చర్, సంబంధిత రంగాలు

వ్యవసాయానికి సంబంధించిన డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే కనీసం 50 శాతం మార్కులతో బైపీసీ పూర్తిచేయాలి. అగ్రికల్చర్ అలాగే సంబంధిత ఇతర కోర్సులను తెలుగు రాష్ట్రాల్లోని సంబంధిత యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

- అగ్రికల్చర్, హార్టికల్చర్
- ఎన్విరాన్‌మెంట్ - పౌల్ట్రీ ఫార్మింగ్
- ఫారెస్ట్రీ అండ్ వైల్డ్ లైఫ్
- రూరల్ అండ్ మేనేజ్‌మెంట్
- వెటర్నరీ సైన్స్

ఫ్లోరీ కల్చర్

కమర్షియల్‌గా పూల సాగు చేయడమే ఫ్లోరికల్చర్. తెగులును తట్టుకునే లా, ఎక్కువ పూలు పూసేలా మొక్కలను తయారు చేయడమే ఫ్లోరికల్చరిస్టుల పని. హార్టికల్చర్‌లో భాగంగా ఉన్న ఇది తరవాతి కాలంలో ప్రత్యేక విభాగంగా మారింది. బీఎస్సీ హార్టికల్చర్/అగ్రికల్చర్‌ను మన దేశంలో చాలా సంస్థలు అందిస్తున్నాయి. ఎంసెట్‌లో మెరిట్ ద్వారా మన రెండు రాష్ట్రాల్లో ఉమ్మడిగా ప్రవేశం పొందవచ్చు.

నవ్య | చిత్రజ్యోతి

థియేటర్ల బంద్ నిజం కాదు



రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివేస్తున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని అపెక్స్ బాడీలు తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ గురువారం స్పష్టం చేశాయి. ఈ మేరకు ఆ సంస్థలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. థియేటర్లను మూసి వేస్తున్నట్లు ఒక సంఘం నిర్ణయం తీసుకుందంటూ వస్తున్న వార్తలను ఆ సంస్థలు ఖండించాయి. 'ఇప్పటివరకూ థియేటర్ల యజమానులు కానీ, వారికి సంబంధించిన సంఘాలు గానీ మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదంతా అబద్ధపు ప్రచారం మాత్రమే' అని స్పష్టం చేశాయి. 'కొన్నాళ్లుగా వసూళ్లు తక్కువ రావడం వల్ల కొంతమంది థియేటర్ల యజమానులు వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకుని ఉండవచ్చు, అపెక్స్ బాడీలకు దీంతో సంబంధం లేదు' అని పేర్కొన్నాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివెయ్యాలనే నిర్ణయం తీసుకునే ముందు ఎగ్జిబిటర్లు తమను సంప్రదించలేదని ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది.



కేన్స్‌కు ఐశ్వర్య కళ

ప్రతిష్ఠాత్మక 77వ కేన్స్ చలనచిత్రోత్సవాల్లో బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచసుందరి ఐశ్వర్యారాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గురువారం ఆమె రెడ్‌కార్పెట్‌పై నడిచారు. బ్లాక్ అండ్ వైట్ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ వేడుకకు ప్రత్యేక కళ తెచ్చారు. ఫ్రాన్స్‌లో జరుగుతోన్న ఈ వేడుకల్లో ఐశ్వర్యతో పాటు కియారా అద్వానీ, శోభితా ధూళిపాళ, అదితీరావ్ హైదరీ పాల్గొన్నారు.

చేతికి కట్టుతో...



ఐశ్వర్యారాయ్ బచ్చన్ కేన్స్ చలనచిత్రోత్సవంలో మరోసారి మెరవబోతున్నారు. గురువారం కూతురు ఆరాధ్యతో కలసి ఈ వేడుకల్లో పాల్గొనేందుకు బయల్దేరివెళ్లారు. తల్లీ కూతుళ్లు ఇద్దరూ గురువారం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు. చేతికి గాయం అయినప్పుడు ధరించే కట్టుతో ఐశ్వర్య కనిపించారు. దీంతో రెడ్‌కార్పెట్‌పై ఆమె ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HPclzIT లో చదవండి.

పెద్ద హిట్ అవుతుంది

'ఈ సినిమాకు అరుణ్, నాగ బలం. నేను ఇంతవరకూ దర్శకుల్ని పరిచయం చేశాను. తొలిసారిగా నాగను నిర్మాతగా ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. ట్రైలర్ చూస్తే టీమ్ పడిన కష్టం తెలుస్తుంది. ఇది న్యూ ఏజ్ లవ్ స్టోరీ అవుతుంది. ఈ నెల 25న వస్తున్న మా సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు దిల్ రాజు. ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'లవ్ మీ' ట్రైలర్‌ను గురువారం విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి ఈ సినిమాను నిర్మించారు.



దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ 'యుద్ధం చేయడం కంటే ప్రేమించడానికి గట్స్ కావాలి. మనిషి ప్రేమను పొందడమే కష్టం అనుకుంటే దెయ్యాన్ని ప్రేమించడం ఇంకెంత కష్టమో ఆలోచించండి. ఆశిష్ ఈ పాత్రను అద్భుతంగా పోషించాడు. గంగాదేవిలాంటి పాత్రను వైష్ణవి చేశారు. ఈ ప్రపంచాన్ని ప్రేమే నడిపిస్తోంది. 'వై' అనే క్వశ్చన్ లేకుండా 'వావ్' అనుకుని ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు.
'ఇంత మంచి సినిమా చేసే అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. మా సినిమాతో మళ్లీ థియేటర్లు కళకళలాడతాయి' అన్నారు ఆశిష్. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా, టఫ్‌గా ఉండే పాత్రను పోషించానని వైష్ణవి చైతన్య చెప్పారు.











చల్లావారిపాలెంలోని కేంద్రం వద్ద హాల్ టిక్కెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు ప్రారంభం

- తొలి రెండు రోజులు అగ్రికల్చరల్, ఫార్మసీ పరీక్ష
- 18 నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమ్ విద్యార్థులకు

గుంటూరు(విద్య), మే 16: ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రి కల్చరల్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్టు గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం అగ్రికల్చరల్, ఫార్మసీ విద్యార్థుల కోసం 9 కేంద్రాలు, ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం 23 కేంద్రాలు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు జేఎన్‌టీయూ(కాకినాడ) ఏర్పాటు చేసింది. ఆయా కోర్సుల్లో ప్రవేశంకోసం దాదాపు 17వేల మందికి పైగా హాజరుకానున్నారు. ఈనెల 16, 17 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ విద్యార్థులకు 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నారు.

దళిత సర్పంచ్ ఇంటిపై వైసీపీ మూక దాడి

- ప్రచార వాహనం ఆటో అద్దాలు పగులకొట్టి ధ్వంసం

బెల్లంకొండ, మే 16 : మండల కేంద్రమైన బెల్లంకొండ దళిత సర్పంచ్ ఇంటి పై వైసీపీ నేతలు దాడికి యత్నించారు. ఆ సమయంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం ఇంటిలో లేక పోవటంతో బయట ఉన్న ప్రచార వాహనం ఆటో అద్దాలను పగలగొట్టి ధ్వంసం చేశారు. ఆ సమయంలో చుట్టు పక్కలవారు వైసీపీ నాయకులను అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే లోపే ఆటో అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ ఘటనపై సర్పంచ్ జ్యోతిసముద్రం మాట్లాడుతూ బెల్లంకొండ మండలంలో రౌడీ రాజకీయాన్ని ప్రోత్సహిస్తున్న వైసీపీ పెద్దలు ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకోవాలన్నారు. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో రౌడీ రాజకీయాలు రెచ్చగొడితే తాము చూస్తూ ఊరుకోమని, తాము తిరగబడితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని హెచ్చరించారు. దళితుల ఎదుగుదలను ఓర్వలేకనే వైసీపీ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం నిందితుడిని మహిళలు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.



ధ్వంసమైన ఆటో

విధుల భారం

- విధుల బడలికతోనే ఎన్నికల సిబ్బంది
- 36 గంటలపాటు నిర్విరామంగా విధులు
- చెల్లింపుల్లో పక్షపాత వైఖరి

గుంటూరు(విద్య),మే16: ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఈసారి అధికారులు చుక్కలు చూపించారు. ఉమ్మడి జిల్లాలోని 17 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల కోసం దాదాపు 15 వేల మందికిపైగా సిబ్బందికి ఎన్నికల సంఘం విధులు కేటాయించింది. ఇందులో టీచర్లు, లెక్చరర్లుకు పీవో, అసిస్టెంట్ పీవో విధులు కేటాయించగా, ఇతర సిబ్బందికి వోపీవో బాధ్యతలు అప్పగించారు. ఇక ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పారిశుధ్య సిబ్బంది, ఆశావర్కర్లతో పాటు అనేక మందిని రిజర్వు సిబ్బందికి విధులు కేటాయించారు. ఈనెల 13న జరిగి ఎన్నికల ఒకరోజు ముందే పంపిణీ కేంద్రాల నుంచి ఈవీఎంలు, ఇతర సామగ్రి తీసుకుని తమకు కేటాయించిన బూత్‌లకు సిబ్బంది వెళ్లారు. అప్పటి నుంచి వారు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కొన్నిచోట్ల పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. సామగ్రిని తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడానికి 13వ తేదీ అర్ధరాత్రి వరకు పట్టింది. ఇక ఎన్నికల చెల్లింపులు ఇతర లాంఛనాలు పూర్తయ్యేసరికి 14వ తేదీ ఉదయం అయింది. అంటే దాదాపు 36 గంటల పాటు ఎన్నికల విధుల్లో సిబ్బంది పాల్గొన్నారు. దీంతో వయసు ఎక్కువ ఉన్న సిబ్బంది అనేక మంది తీవ్ర ఒత్తిడికి, బడలికకు గురయ్యారు. అనేక మందికి ఆరోగ్య సమస్యలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలింగ్‌లో పాల్గొన్న సిబ్బంది కనీస మౌలిక వసతులు కల్పించ లేదనే ఆరోపణలు ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు.

గుంటూరులోని ఏసీ కళాశాలలో రిజర్వు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రానికి ఆదివారం గుంటూరు నగరంతోపాటు జిల్లాలో బాపట్ల, పొన్నూరు, తాడికొండ తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో రిజర్వు సిబ్బందిని ఆర్వో రప్పించారు. టీచర్లతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అరకొరగా భోజనం పెట్టి వారి పట్టించుకోవడం మరిచిపోయారు. దాదాపు 400 మందికిపైగా ఉన్న రిజర్వు సిబ్బంది సాయంత్రం వరకు కనీసం మంచినీరు కూడా లేకుండా కేంద్రంలో ఎదురు చూడాల్సి వచ్చింది. అనేక కేంద్రాల్లో సాయంత్రం 5 గంటలకే రిజర్వు సిబ్బందిని ఇంటికి పంపి మరుసటిరోజు అవసరాన్ని బట్టి విధులు కేటాయిస్తాని చెప్పారు. అయితే ఏసీ కళాశాలలో మాత్రం రాత్రి 8 గంటలైనా సిబ్బంది డ్యూటీలు కేటాయించ లేదు. తీరా రాత్రి 8.30 వచ్చిన ఎన్నికల అధికారులు మీరు ఇప్పుడు ఇంటివెళ్ళి మరలా ఉదయం 6 గంటల కల్లా రావాలని హుకుం జారీ చేశారని సిబ్బంది వాపోయారు. దీంతో సిబ్బంది తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు.

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించే రెమ్యూనరేషన్ చెల్లింపుల్లో తీవ్రస్థాయిలో తేడాలు ఉంటున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఒక నియోజక వర్గంలో సిబ్బందికి చెల్లించిన రెమ్యూరేషన్‌లో మరో నియోజక వర్గంలో సిబ్బందికి చెల్లించిన రెమ్యూరేషన్‌లో తేడాలపై తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజక వర్గాల్లో పీవో, పీఈవోలకు రూ.2050, వోపీవో లకు రూ.750 చెల్లించారు. అదే విధంగా తాడికొండ, పొన్నూరు, పత్తిపాడు, తెనాలి నియోజక వర్గాల్లో పాల్గొన్న పీవో, ఏపీవోలకు రూ.1750, వోపివోలకు రూ.500 చెల్లించారు. దీంతో పీవో, ఏపీవో స్థాయిలో చెల్లింపుల విషయంలో రూ.300, వోపీవో స్థాయిలో చెల్లింపుల విషయంలో రూ.250 వరకు తేడాలు ఉన్నాయని ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక నియోజక వర్గాల్లో ఇదే విధంగా తేడాలు ఉన్నాయని ఎన్నికల సిబ్బంది వాపోతున్నారు.



ఎన్నికలకు ముందు రోజు విధుల్లో తలమునకలైన సిబ్బంది (ఫైల్)

తీవ్ర ఒత్తిడిలో విధుల్లో పాల్గొన్నా..

ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది పోలింగ్‌కు ఒకరోజు ముందే కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఎన్నికల సమాగ్రి స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించే వరకు విధుల్లో కొనసాగారు. దీంతో ప్రతిస్థాయిలోనూ తీవ్ర ఒత్తిడితో పని చేశామని చెబుతున్నారు. తీరా తాము పడిన శ్రమకు ప్రతిఫలం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. జిల్లాలో దాదాపు 15 వేల మందికి పైగా సిబ్బంది నేరుగా ఎన్నికల విధుల్లో పాల్గొనగా, పరోక్షంగా మరో 5వేల మంది విధుల్లో పాల్గొన్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇలా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించిన వారిపట్ల పక్షపాత వైఖరి తగదని, అందరికి ఒకే స్థాయిలో చెల్లంపులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జంగాపై జగన్ అక్కసు

- అర్ధరాత్రి వేళ అనర్హత వేటు
- వివరణ తీసుకోకుండానే బీసీ నేతపై కక్షసాధింపు
- భగ్గుమంటున్న యాదవ సామాజిక వర్గం



జంగా కృష్ణ మూర్తి

గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న గురజాల నియోజకవర్గ నేత జంగా కృష్ణమూర్తిపై సీఎం జగన్‌రెడ్డి కక్ష తీర్చుకున్నారు. బుధవారం అర్ధరాత్రి ఆయన ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు వేయించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే బీసీ సామాజికవర్గ నేతపై జగన్ కక్ష సాధిం పునకు పాల్పడటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కనీసం వివరణ కూడా తీసుకోకుం డానే తనను పదవి నుంచి తప్పించారని జంగా కృష్ణమూర్తి గురువారం ఆరోపించారు. జంగా విషయంలో వైసీపీ అధిష్టానం, ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న చర్యపై యాదవ సామాజిక వర్గం భగ్గుమంటోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని యాదవ సామాజిక వర్గంలో జంగా కృష్ణమూర్తికి ప్రత్యేకమైన స్థానముంది. 1999కి ముందు ఆయన తెలుగుదేశం పార్టీ ట్రేడ్ యూనియన్ నాయకునిగా కొనసాగారు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం మొగ్గు చూపటంతో ఆ పార్టీలో చేరారు. వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గురజాల సీటును డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లకు కేటాయిం చినప్పటికీ జంగా ఆ కుటుంబానికి విధేయుడుగానే కొనసాగుతూ వచ్చారు. రాజశేఖర్‌రెడ్డి మరణాంతరం జంగా కృష్ణమూర్తి జగన్ వెన్నంటే వున్నారు. వైసీపీలో చేరటానికి చాలామంది తటపటాయిస్తున్న రోజుల్లో అందరికంటే ముందు ఆ పార్టీ లో చేరారు. జగన్మోహన్ రెడ్డి ఓదార్పు యాత్రలో ఆయన వెన్నంటే వున్నారు. వైసీపీ బీసీ రాష్ట్ర అధ్యక్షుడు పదవిని తీసుకుని జగన్ కోసం రాష్ట్రంలో తీవ్రంగా పర్యటించారు. బీసీ సామాజిక వర్గాలను ఏకతాటి పైకి తీసుకువచ్చి వైసీపీకి ఓట్లు వేయించారు. చివరకు జంగా ఆరోగ్యం బాగాలేని పరిస్థితిలో కూడా జగన్ కోసం అహర్నిశలు శ్రమించారు.

ఆయన పదవి కోసం పాదయాత్ర..

రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జంగా కృష్ణమూర్తి జగన్ కోసం సాహసోపేతమైన కార్యాన్ని చేశారు. జగన్మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ గురజాల నుంచి హైదరాబాదు వరకు పాదయాత్ర చేశారు. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయ సంచలనం సృష్టించింది. నాటి ముఖ్యమంత్రి రోశయ్య కూడా జగన్ కోసం కృష్ణమూర్తి పాదయాత్ర చేశారన్న నెపంతో ఆయనపై కినుక వహించారు. 2014 ఎన్నికల్లో జగన్ నేను ముఖ్యమంత్రి కావాలా.. నీకు గురజాల ఎమ్మెల్యే సీటు కావాలా అని అడిగితే.. మీరు ముఖ్యమంత్రి అయితే చాలు అంటూ ఎమ్మెల్యే బరిలో నుంచి తప్పుకొన్నారు. జంగా సీటు త్యాగంతో గురజాలలో అడుగుపెట్టిన కాసు మహేష్‌రెడ్డి ఆయన్ను చాలా అవమానిస్తూ వచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టినప్పటికీ పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. గురజాల నియోజకవర్గంలోని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడుగా ఉన్న ఎమ్మెల్సీ జంగాను అడుగడుగునా ఇబ్బందులు పెడుతూ వచ్చారు. చివరకు ఆయనతో సన్నిహిత సంబంధాలు ఉన్న సొంత పార్టీ నేతలపై కూడా కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ఒకానొక దశలో కాసు మహేష్ రెడ్డి జంగా కృష్ణమూర్తికి మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. నియోజకవర్గంలో జరుగుతున్న అవమానాలను జంగా పలుమార్లు పార్టీ ముఖ్య నేతలు దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఎవరూ పెద్దగా స్పందించక పోగా చూద్దాం అంటూ వాయిదాలు వేస్తూవచ్చారు. సీఎం జగన్మోహన్ రెడ్డితో కూడా జంగా నియోజకవర్గంలో జరుగుతున్న విషయాలపై చర్చించారు. తనకోసం ఎంతో కష్టపడిన జంగాకు అడుగడుగునా అవమానాలు ఎదురవుతున్నా జగన్మోహన్‌రెడ్డి కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. దాంతో మహేష్ రెడ్డి జంగా వ్యవహారంలో మరింత దూకుడుగా ప్రవర్తించి పార్టీ నుంచి బయటకు వెళ్ళేటట్లు చేశారు.

డీఆర్ఎం రోడ్డులో ఆర్‌యూబీ మూసివేత

గుంటూరు, మే16(ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం రోడ్డు నుంచి నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలవైపు దారిలోవున్న ఆర్‌యూబీని నెల రోజులపాటు మూసివేస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజినల్ మేనేజర్ ఎం రామకృష్ణ తెలిపారు. ఈ నెల 19 నుంచి జూన్ 18 వరకు బ్రిడ్జి సీసీ రోడ్డు అప్రోచ్‌ల రిపేర్ల నిమిత్తం ట్రాఫిక్‌ని మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని దృష్ట్యా ట్రాఫిక్‌ని ఎల్‌సీ నెంబరు. 6, 311 మీదగా మళ్లిస్తున్నామని, వాహనదారులు గమనించాలని కోరారు.

హతుడు నెల్లూరు వాసి

- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు?

బాపట్ల, మే 16: పోలీసు కార్యాలయాల సముదాయానికి కూతవేటు దూరంలో బాపట్ల పాతబస్టాండ్ దగ్గర నడిరోడ్డుపై ఓ యువకుడిని అతి కిరాతకంగా, విచక్షణా రహితంగా కారుతో గుద్దించి కత్తులతో ఇష్టానుసారంగా నరికి హత్య చేసిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. హతుడి వివరాలకోసం పోలీసులు చుట్టుపక్కల దుకాణాలలో సీసీకెమెరాల ఫుటేజ్‌లు పరిశీలించిన ఫలితం లేక పోయింది. దీంతో చుట్టుపక్కల పోలీసుస్టేషన్‌లకు సమాచారం ఇచ్చి వాహనాలు తనిఖీ చేయమని డీఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు. స్టూవర్టుపురం పోలీసుస్టేషన్ చెక్‌పోస్ట్ దగ్గర విస్తృత తనిఖీలు చేపట్టగా కారులో నుంచి రక్తపు మరకలతో ఓ వ్యక్తి బయటకు దూకి పొలాలలో గుండగా పరిగెత్తే ప్రయత్నం చేశాడు. కారులో ఉన్న మరికొందర ఆపకుండా చెక్‌పోస్ట్ గేట్‌లను సినీఫక్కీలో ఢీకొట్టుకుంటూ వెళ్ళిపోయారు. పొలాల్లో పరిగెత్తుతున్న ప్రధాన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. మృతుడు నెల్లూరులోని పెన్నానది ఒడ్డున వైకుంఠపురంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడు తల్లి అక్కడ రోజువారి తాపీవర్కర్‌గా పనిచేస్తుంది. మృతుడు తండ్రి జయపాల్ టీ మాస్టర్‌గా పనిచేస్తూ బాపట్ల పట్టణంలోని మరియరాణి కాలనీలో ఉంటున్నాడు. గతంలో మృతుడు ప్రశాంత్ నెల్లూరు దగ్గర ఓ వ్యక్తిని దారుణంగా హత్యచేశాడు. ఈ ఘటనలో జైలుకెళ్ళిన ప్రశాంత్ ఇటీవల బెయిల్‌పై వచ్చాడు. హత్యకు గురైన వ్యక్తి బంధువులు ప్రశాంత్‌ను చంపుతారనే భయంతో తల్లి ఇంట్లో నుంచి బయటకు రాకుండా చూసుకుంటున్నది. కాగా తండ్రిని చూచేందుకు బాపట్ల వచ్చిన ప్రశాంత్ బుధవారం రాత్రి పాతబస్టాండ్‌లోని ఓ బార్‌లో మద్యం తాగి వెళుతుండగా అతని స్నేహితుని ద్వారా సమాచారం తెలుసుకున్న నెల్లూరుకు చెందిన వ్యక్తులు కారులో వెంబడిస్తూ అవకాశం చూచుకొని పాతబస్టాండ్ దగ్గర కారుతో ఢీకొట్టి కత్తులతో నరికి చంపి పరారయ్యారు. చివరకు స్టూవర్టుపురం పోలీసుస్టేషన్ దగ్గర ప్రధాన నిందితుడు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై పట్టణ సీఐ యు.శ్రీనివాసులను వివరణ కోరగా రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ప్రశాంత్ హత్యకు గురైనట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు గురువారం బాపట్ల ఏరియా వైద్యశాలకు చేరుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

నరసరావుపేట లీగల్, మే 16: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువవ్వటంతో నిందితురాలికి ఏడాది జైలు శిక్ష, నష్ట పరిహారం చెల్లించేలా న్యాయాధికారి గురువారం తీర్పు వెలువరించారు వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేటలోని గుర్రాల చావిడి ప్రాంతానికి చెందిన షేక్ నాగుర్‌బీ 2020 అక్టోబరు 10న పట్టణంలోని బరంపేటకు చెందిన గట్టినేని చంద్రమౌళి వద్ద రూ.5 లక్షలు అప్పుగా తీసుకుంది. ఇందుకు గాను రూ.6.50 లక్షలకు చెక్కు ఇచ్చింది. ఫిర్యాది చంద్రమౌళి సదరు చెక్కును తన బ్యాంక్ ఖాతాలో వసూలుకు వేసుకున్నాడు. అది చెల్లలేదు. విచారణలో నేరం రుజువవ్వటంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ఆమెకు ఏడాది జైలు శిక్ష, రూ 7.50 లక్షలు ఫిర్యాదికి నష్ట పరిహారం చెల్లించేలా స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవల్లిక గురువారం తీర్పు వెలువరించారు.



మాట్లాడుతున్న పాపారావు, జాస్తి వీరాంజనేయులు

రూ.998.84 కోట్లు ఏమయ్యాయి?

- సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడే పాపారావు

గుంటూరు సిటీ, మే 16: కేంద్ర ప్రభుత్వం నెలన్నర క్రితం పంచాయతీలకు విడుదల చేసిన రూ.998.84 కోట్లు ఏమయ్యాయని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం బ్రాడీపేటలోని సర్పంచుల జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఖజానాలో నిధులుంటే ఎందుకు పంచాయతీల ఖాతాలో జమ చేయటం లేదు అని ప్రశ్నించారు. ఆర్థికశాఖ అధికారులను అడిగితే టోకెన్లను క్లియర్ చేయాల్సి ఉన్నదని చెబుతున్నారని అన్నారు. వేసవిలో కనీసం మంచినీరు కూడా గ్రామాల్లో అందించలేని దుస్థితి లో సర్పంచ్‌లు ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరంజనేయులు మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన నిధులు పక్కదారి పట్టించి స్థానిక సంస్థలను ఇబ్బందులపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి గడచిన ఎన్నికల్లో ప్రజలు బాగానే బుద్ధి చెప్పి, ఇంటికి సాగనంపుతున్నారని అన్నారు. తాగేందుకు నీళ్లు లేక ఖాళీ బిందెలతోటి ప్రజలు నిరసన ప్రదర్శన చేస్తూ ఉంటే రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి సత్యనారాయణ నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ కూర్చోవడం దుర్మార్గం అని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సర్పంచులు చందు వెంకట సాంబశివరావు, నల్లపాటి లలిత కుమారి, కొర్రపాటి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అల్లర్లపై కేసులు నమోదు

క్రోసూరు, మే 16: క్రోసూరు మండలంలో ఎన్నికల సందర్భంగా మే 13వ తేదీన జరిగిన గొడవలకు గాను ఐదు కేసులు నమోదు చేసినట్టు పెదకూరపాడు సీఐ మంగారావు తెలియ జేశారు. మండలంలోని దొడ్లేరులో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు ఒకరిపై ఒకరు పలుమార్లు బాహాబాహీకి దిగారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఎర్రబాలెంలో జరిగిన వైసీపీ దాడుల్లో టీడీపీ మద్దతుదారులు ఇద్దరికి గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి క్రోసూరులో టీడీపీ నేత కంభంపాటి రాము, కంభంపాటి బాబులపై వైసీపీ శ్రేణులు దాడులు చేశాయి. ఈ ఘటనలో కూడా వైసీపీకి చెందిన కొందరిపై కేసులు నమోదు చేసినట్టు తెలియజేశారు. మరికొంత మందిని స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేసినట్టు తెలిపారు.

పది కేసులు నమోదు ..

నరసరావుపేట లీగల్: ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో అల్లర్లకు సంబంధించి పది కేసులు నమోదైనట్టు సంబంధిత అధికారులు తెలిపారు. రూరల్ పరిధిలో దొండపాడు గ్రామంలో ఒకటి, పమిడిపాడులో ఒకటి కేసులు నమోదయ్యాయని, టీడీపీకి చెందిన ఓ కారు ధ్వంస మైందని రూరల్ ఎస్ఐ ఎం రోశయ్య తెలిపారు. మొదటి పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై టీడీపీ వర్గీయులు దాడి చేసినట్టు కేసు నమోదైందని సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో టీడీపీ వారిపై మూడు కేసులు, వైసీపీ వారిపై రెండు కేసులు నమోదయ్యాయని రెండవ పట్టణ సీఐ ఏ భాస్కర్ తెలిపారు. రొంపిచర్ల పరిధిలో ఎన్నికల అల్లర్లకు సంబంధించి రెండు కేసులు నమోదైనట్టు డీఎస్పీ వర్మ తెలిపారు. ఎన్నికల అల్లర్ల సంబందంగా మొత్తం ఏడు కార్లు ధ్వంసం అయినట్టు వర్మ తెలిపారు.

పెదఅగ్రహారంలో కేసు నమోదు

పిడుగురాళ్ల: సాధారణ ఎన్నికల రోజున పిడుగురాళ్ల మండల పెదఅగ్రహారం గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవల్లో ఇరువర్గాలకు చెందిన 32 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రబ్బాని తెలిపారు.

21న అరుణాచలం గిరి ప్రదక్షిణకు

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గుంటూరు, మే 16: పౌర్ణమి సందర్భంగా ఈనెల 23న అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి 21న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 22వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 23న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 24వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సు సర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కో ఛార్జీ రూ.2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ నేతల హౌస్ అరెస్టు

గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు సహా పలువురు టీడీపీ నేతలను గురు వారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈనెల 13న ఎన్నికల సందర్భంగా, అనంతరం ఎన్నికలు ముగి సిన తర్వాత వైసీపీ మూక అల్లర్లు, దాడులు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న తరుణంలో వైసీపీ గూండాల దౌర్జన్యాలపై టీడీపీ బుధవారం ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో జిల్లా నుంచి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జూలకంటి బ్రహ్మారెడ్డితో పాటు పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వున్నారు. వీరంతా గురువారం ఉదయం మాచర్ల వెళ్లవలసివుండగా వారిని ఎటూ కదలనీయ కుండా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బుధవారం అర్ధరాత్రి మంత్రి ఆనంద బాబు, జంగా కృష్ణమూర్తి, బ్రహ్మా రెడ్డి ఇళ్ల వద్దకు వచ్చి పోలీసులు మోహరిం చారు. ఆనందబాబుకు గురువారం ఉదయం సీఐ నోటీసులు అందజేశారు. ఈ నిర్బంధాలను టీడీపీ నేతలు ఖండించారు. తమ పార్టీ కార్యకర్తలపై దౌర్జన్యాలు, దోపి డీలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు, తమను మాత్రం గృహ నిర్బంధంచేయడం దుర్మార్గమని, ప్రజాస్వామ్య విరుద్ధమని ఆనందబాబు, చిట్టాబత్తిన చిట్టిబాబు, మద్దిరాల మ్యాని విమర్శించారు.



ఆనందబాబుకు నోటీసు అందిస్తున్న సీఐ

పావలా సంక్షేమానికి ముప్పావలా వడ్డీ

- చెత్త పన్ను దగ్గర నుంచి కరెంటు బిల్లు వరకు బాదుడే బాదుడు
- 1612వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మే 16: వైఎస్ జగన్‌రెడ్డి పాలన ప్రజలకు పావలా సంక్షేమాన్నిచ్చి ముప్పావల వడ్డీ వసూలు చేసినట్టుందని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు భూములిచ్చిన రైతులు ఎద్దేవా చేశారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1612వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు ముసుగులో జగన్‌రెడ్డి ప్రజల నుంచి కోట్ల రూపాయలను కొల్లగొట్టాడని, ఓ వైపు ధరాల భారాలు, మరో వైపు పన్ను పోటు ప్రజల నడ్డివిరిచాయని అన్నారు. పేద వర్గాల అభ్యున్నతి మాటున ఆయా ప్రజలను అడ్డగోలుగా దోచుకున్నాడని మండిపడ్డారు. మూడు రాజధానులంటూ ఉన్న రాజధానిని లేకుండాచేసి లక్షల కోట్ల అమరావతి సంపదను ఆవిరి చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు పొటెత్తి మరీ ప్రభుత్వంపై తమ నిసనను తెలియజేశారని, ఈ దుర్మార్గ పాలన అంతమై త్వరలోనే కూటమి ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. అప్పుడు రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు, పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభమై పూర్తవుతాయని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00

ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➡ గుంటూరు సిటిలోని పట్నం బజార్ నందు శ్రీ సాయి విఘ్నేశ్వర ట్రేడర్స్ నందు పనిచేయుటకు స్టాఫ్ / అకౌంటెంట్ కావలెను. సంప్ర॥ 8688998899. AJG-191110

➡ 7 Hills మెడికల్ షాపు నందు పని చేయుటకు బాయ్స్, గర్ల్స్ మరియు అకౌంటెంట్ కావలెను. సంప్రదించండి : 97053 98691, 77999 55804. AJG-191097

➡ బియ్యం షాపులో పనిచేయుటకు గుమాస్తా కమ్ హెల్పర్స్ కావలెను. జీతం : 14,000/- సంప్రదించండి : వెంకట సీతావరలక్ష్మీ ట్రేడర్స్, Opp. స్టాల్ గరల్స్ హైస్కూల్ ఎదురు, నగరం పాలెం, గుంటూరు. AJG-191109

➡ ఉండవల్లి లోని శుభోదయ సూపర్ బజార్ నందు పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్-2, జీ:12-15వేలు, కౌంటర్ ఆపరేటర్ జీ. 10వేలు, కావలెను. సంప్ర॥ 9966113007 AJG-191112

➡ ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థలో పార్ట్ టైం బిజినెస్ / ఫ్రాంచైజీ, పెట్టుబడి లేదు, అధిక ఆదాయం కొరకు Retired Employees, Business People, మరియు గృహిణులు కావలెను. అర్హత : ఇంటర్ / ఆపైన Age 30 + Cell : 98662 85503 AJB -182404

➡ Looking for Female experienced teachers in a reputed Preschool (Narasaraopet) with good communication skills. Call : 9440415414. AJH-0173

ఆయుర్వేదం

➡ అంగస్తంభన లేకపోవటం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేక పోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికావైద్యం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా.సిహెచ్.రామకృష్ణ VJA. సెల్ : 84650 56299 AJB-116

అద్దెకు

➡ గుంటూరు, 4/1 బ్రాడీపేట, రఘుమాన్షన్ నందు IInd Floor 1600 Sft మరియు Ist Floor 360 Sft గల Space ఆఫీసులకు అద్దెకు కలదు. సంప్ర॥ ఫోన్ : 94405 77349. AJG-184958

SPOKEN ENGLISH

➡ ఇంగ్లీషు 60 గర్స్ ద్వారా సులభంగా మాట్లాడండి రేపటి నుండి 5 రోజులు ఫ్రీ క్లాసులకు హాజరుకండి ఆఫ్ / ఆన్‌లైన్ క్లాసులు వాట్సప్ ద్వారా ప్రామాణిక 10/4 అరండల్‌పేట, మాలకొండయ్య కాలనీ, గుంటూరు. సెల్ : 94405 39029. AJG-191113

EDUCATION

➡ ఆంధ్ర లయోలా కాలేజ్, విజయవాడలో B.Sc. డిజిటల్ ఫోరెన్సిక్స్, AI & ML, అగ్రికల్చర్, DATA SCIENCE; BBA - ఏవియేషన్; B.VOC డైరీయింగ్ & A.H కోర్సులు కలవు. అర్హత : ఇంటర్. IBM Certificate, ప్రభుత్వ ఉద్యోగార్హత కలవు సంప్ర : 79896 47611 AJB - 182322

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును


➡ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999 AJB-182136

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ళ	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 99639 84109
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 91103 23914
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్లలో రెపరెపలాడనున్న టీడీపీ జెండా

● నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

పిట్టలవానిపాలెం, మే 16 : ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో గత రెండు దశాబ్దాలు తర్వాత బాపట్ల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడుతుందని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మండలంలోని 14 గ్రామపంచాయతీలలో 34 పోలింగ్ కేంద్రాలలో ఏయే బూత్‌లలో ఎంత మెజార్టీ వస్తుందని కూటమి నాయకులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గం మొత్తం భారీ మెజార్టీతో విజయం సాధిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన నారాయణ, టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకర్‌రెడ్డి, జాలాది లోకరాజ్యుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో క్లీన్ స్వీప్ చేయనున్న కూటమి అభ్యర్థులు

● టీడీపీ బాపట్ల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సలగల రాజశేఖర్

బాపట్ల, మే 16 : అధికార పార్టీ నాయకులు ఎన్ని దాడులు చేసినా, దౌర్జన్యాలకు పాల్పడినా ఓటర్లు చెక్కు చెదరని అభిమానంతో కూటమి అభ్యర్థులనే బలపర్చారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్ స్పష్టం చేశారు. ఆయన గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేస్తారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులతోపాటు ఎంపీ అభ్యర్థి కూడా విజయం సాధించటం తథ్యమన్నారు. టీడీపీకి ప్రజలు మద్దతు తెలియజేయటంతో జీర్ణించుకోలేని వైసీపీ శ్రేణులు ఓటమి భయంతో దాడులను ప్రోత్సహిస్తున్నారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పొత్తులో భాగంగా జనసేన పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో తమ ఓటింగ్‌ను కూటమి అభ్యర్థులకు మళ్ళించటం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా జనసైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. బాపట్లలో జరిగిన ఘర్షణలపై ఎన్నికల కమిషన్‌కు, జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పర్చూరు నియోజకవర్గంలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతులకు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. త్వరలోనే బాపట్ల పట్టణంలో తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని సలగల రాజశేఖర్ తెలిపారు.

బాధిత దివ్యాంగులకు న్యాయం చేయాలి

● జనసేన దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు

బాపట్ల, మే 16 : గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలో మైనార్టీ సామాజికవర్గానికి చెందిన దివ్యాంగులు షేక్ నబీ, షేక్ జానీ బాషాల సైకిల్ షాపులపై వైసీపీశ్రేణులు దాడి చేయటం దారుణమని బాపట్ల జిల్లా జనసేన దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు అన్నారు. ఈ విషయమై గురువారం బాపట్ల బేతనీకాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాంబులతో దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయటం హేయమైన చర్య అన్నారు. దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బాలసుందర్, లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీ శ్యామవారాహి మహాదేవిగా శ్రీబగళాముఖి అమ్మవారు



శ్రీ శ్యామవారాహి మహాదేవిగా శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, మే 16 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి శతజయంతి తిరునాళ్ళ మహోత్సవాలు సందర్భంగా శ్రీబగళాముఖి అమ్మవారు శ్రీ శ్యామ వారాహి మహాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఉదయం 7 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, బాలభోగ సమర్పణ, కుంచాల వారి తూర్పుపాలెం గ్రామాలలో ఘటం, పావనం ఊరేగింపుగావించారు. ఈ కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై కొలువు తీరిన భావదేవుడు



హంస వాహనంపై ఊరేగుతున్న భావదేవుడు

బాపట్ల, మే 16 : పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణ స్వామి 1431వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు హంస వాహనంపై కొలువుతీరారు. అర్చకస్వాములు శ్రీనివాసుల విఖనసమూర్తి, నల్లూరి విజయసారధి, నల్లూరి పాంచజన్యం, బృందావనం గోపిచంద్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తజనం స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారు హంస వాహనంపై నగరోత్సవం చేశారు.

బాపట్లలో వర్షపుజల్లులు.. చల్లబడిన వాతావరణం

బాపట్ల, మే 16 : ఈ ఏడాది వేసవితీవ్రత అధికంగా ఉండటంతోపాటు వడగాలులు, వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోయిన దరిమిల గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షపు జల్లులతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. వేసవి తీవ్రత నుంచి ఉపశమనం పొందారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బాపట్ల బ్రాంచ్ వారు ది.23-11-2023న ప్రచురించిన **కొమట్ల సీతారామిరెడ్డి** గారి భార్య **కొమట్ల మహాలక్ష్మి** గారికి సంబంధించిన ప్రకటనలో Main DOC NO: 7753/2023 అని మాత్రమే ఇచ్చియున్నాము. తదుపరి సవరణ జరిగినందున సవరణ DOC NO: 5806/2024 S.R.O. బాపట్ల అని తెలియజేయటమైనది.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా సుబ్బారావు

బాపట్ల, మే 16 : బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ జి.పిచ్చిరెడ్డి వ్యక్తిగత సెలవులపై వెళ్ళటంతో డీపీఎం యు.సుబ్బారావుకు ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు అప్పగించారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

రక్తనాళ సంబంధిత వ్యాధుల నిపుణులు ఒంగోలు రాక

12 సంవత్సరాల అపార అనుభవము కలిగిన బృందం నుండి

డా. నరేంద్రనాద్ మేడా వారి వైద్య బృందం నుండి

డా॥ బి. విశాల్

MBBS, DNB, M.Ch, (Vascular Surgery, MMC, Chennai)

Consultant Vascular & Endovascular Surgeon

ఈ నెల తేది. 19-05-2024, ఆదివారం

ఉ॥ 10గం॥ నుండి సా॥ 4గం॥ వరకు అందుబాటులో ఉంటారు

KIMS HOSPITALS | కిమ్స్ హాస్పిటల్ NH-5, నార్త్ బైపాస్ రోడ్డు, ఒంగోలు.

అపాయింట్‌మెంట్ కొరకు 08592 - 667788, 70958 78686

క్రాస్ ఓటింగ్ ఎవరిని ముంచేనో?

● నేతల తలరాతలు మారుస్తున్న మండల ఓటర్లు



సార్వత్రిక ఎన్నికలలో బాపట్ల టౌన్‌హాలు వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

బాపట్ల, మే 16 : బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి క్రాస్ ఓటింగ్ పెద్ద ఎత్తున జరిగిందనే ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతికి వ్యతిరేకంగా పని చేసిన వారంతా ఒక ఓటు వైసీపీకి మరో ఓటు టీడీపీకి వేయాలని ప్రచారం చేశారు. టీడీపీ తరుపున పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు ఒక ఓటు మరో ఓటు వైసీపీ ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ లేదా కాంగ్రెస్ అభ్యర్థి జేడీ శీలంకు వేయాలనే ప్రచారం జరిగింది. దీంతో రెడ్డి సామాజికవర్గానికి చెందిన గ్రామాలు, ఎస్సీ కాలనీలలో ఓటర్లు ఎక్కువ మంది క్రాస్ ఓటింగ్ చేసినట్లు తెలిసింది. అయితే క్రాస్ ఓటింగ్ ఏవిధంగా చేశారనేది అర్థంకాక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. అనుకున్న ప్రకారం ఎమ్మెల్యే ఓటు టీడీపీకి, ఎంపీ ఓటు వైసీపీకి వేస్తే పర్వాలేదు. అదే తారుమారైతే పరిస్థితి ఏమిటనే ఆలోచనలో నాయకులు ఉన్నారు. 2019 ఎన్నికలలో కూడా క్రాస్ ఓటింగ్ జరిగింది. అప్పట్లో ఎమ్మెల్యే కోన రఘుపతి కన్నా ఎంపీ నందిగం సురేష్‌కు 3వేలకు పైగా బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్లు లభించాయి. చదువుకున్నవారు క్రాస్ ఓటింగ్ సక్రమంగా చేసినా, గ్రామాలలో ప్రజలు ఏవిధంగా చేయగలరనే ప్రశ్న నాయకులను పట్టిపీడిస్తున్నది. రెడ్డి సామాజికవర్గం, ఎస్సీల ఓట్లు ఎక్కువ మొత్తంలో గ్రామాలలోనే ఉన్నాయి. వీరిలో ఎక్కువ మంది చదువుకోనివారు ఉన్నారు. వీరు క్రాస్ ఓటింగ్ ఏవిధంగా చేశారనేది ప్రశ్నగా మిగిలింది. దీనికితోడు పట్టణంలో కన్నా మండలంలోనే ఓటింగ్ శాతం ఎక్కువ జరిగింది. బాపట్ల పట్టణంలో 43,487 మంది ఓట్లు వేశారు. ఇక్కడ 73.9 శాతం ఓట్లు నమోదయ్యాయి. మండలంలో 52,057 మంది ఓట్లు వేశారు. ఇక్కడ 87.44 శాతం, కర్లపాలెం మండలంలో 36,508 మంది ఓట్లు వేశారు. ఇక్కడ 87.6 శాతం ఓట్లు పోలయ్యాయి. పిట్టలవానిపాలెం మండలంలో 26,448 మంది ఓట్లు వేయగా 85.6శాతం ఓట్లు నమోదయ్యాయి. ఈవిధంగా పట్టణంలో కన్నా గ్రామాలలోనే ఓట్ల శాతం పెరిగింది. దీని ప్రభావం ఎవరిపై చూపేను? బాపట్ల పట్టణంలో తెలుగుదేశం అభ్యర్థికి మెజార్టీ వస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికలలో కూడా ఇక్కడ టీడీపీ అభ్యర్థికే మెజార్టీ వచ్చింది. మండల ఓటర్లే రాజకీయ నాయకుల రాతలు మారుస్తున్నారు. ఈ పర్యాయం ఏమి జరుగుతుందోననే చర్చ పెద్ద ఎత్తున జరుగుతుంది. అయినప్పటికి గెలుపుపై బెట్టింగ్‌లు జరుగుతూనే ఉన్నాయి.

ప్రజల భాగస్వామ్యంతో డెంగీని నివారిద్దాం

● డీఎం హెచ్‌వో డాక్టర్ విజయమ్మ



జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బాపట్ల, మే 16 : ప్రజల భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని డీఎం హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం దగ్గర నుంచి జాతీయ డెంగీ నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ర్యాలీని డీఎం హెచ్‌వో ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి రాకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. ప్రజలు కూడా దీనికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. దోమతెరలు వాడటం, దోమకాటు నుంచి రక్షణ పొందటం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడేని డ్రైడేగా పాటించాలన్నారు. వాడిపారేసిన పాత టైర్లు, కొబ్బరిచిప్పలు, ప్లాస్టిక్ గ్లాసులలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు ఉన్న చోట దోమలు పెరగకుండా ఆయిల్ చల్లాలన్నారు. జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా రక్తపరీక్షలు చేయించుకొని వైద్యం పొందాలన్నారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కె.ప్రేమచంద్, ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.బ్రహ్మానందం, జిల్లా డెమో సెక్షన్ సిబ్బంది బి.మరియమ్మ, ఆర్.అరుణ, సబ్ యూనిట్ అధికారులు ఎండీ షకీల్, ఎస్కే కదిర్, బి.వెంకటేశ్వర్లు, జూగుంట రాంబాబు, పట్టణ ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు పాల్గొన్నారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ

రేపల్లె మండలంలో...

రేపల్లె, మే 16 : సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దామని ఎంపీహెచ్‌ఈవో రంగారావు అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని మోళ్ళగుంట, బేతపూడి, నల్లూరుపాలెం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కల్యాసాయిబాబు మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ఇళ్ళ వద్ద మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధిచెందుతాయని, ప్లాస్టిక్ వ్యర్థాలను, కొబ్బరిబోండాల వ్యర్థాలను ఇళ్ళ వద్ద ఉంచరాదని సూచించారు. వాటిల్లో నిల్వ ఉన్న నీటి ద్వారా దోమలు పెరిగి డెంగీ జ్వరాలు వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. దోమతెరలు వాడాలని, ఎటువంటి జ్వరం వచ్చినా ముందుగా సమీపంలోని ఆశా కార్యకర్త, ఏఎన్‌ఎంలను సంప్రదించి రక్త పరీక్షలను చేయించుకుని ఏ జ్వరమో నిర్ధారించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, సుభాషన్, మోషే తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో...

వేమూరు, మే 16: మండలంలోని పెరవలి గ్రామంలో గురువారం మండల వైద్యాధికారి వెంకట సురేష్ ఆధ్వర్యంలో డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ డీవో శేషగిరిరావు మాట్లాడుతూ డెంగీ జ్వరంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధి సోకకుండా ఉండేందుకు ప్రధానంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారంగా ఫ్రైడే డ్రైడే ప్రోగ్రాం నిర్వహించాలన్నారు. సచివాలయాల పరిధిలో ఉద్యోగులు ర్యాలీ ద్వారా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నా రు. వైద్యాధికారి వెంకట సురేష్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు చేరి ఉండడం వల్ల వ్యాధిని కలిగించే దోమలు ప్రబలుతాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధి సోకకుండా ఉండేందు కు ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని, ఒకవేళ వ్యాధి సోకితే తక్షణం తీసుకోవలసిన చికిత్సల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటలక్ష్మి, పున్నారావు, పంచాయతీ ఇన్‌చార్జి ప్రభు, వీహెచ్‌ఆర్ కుమార్, ఏఎన్‌ఎంలు, సచివాలయ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు.



పెరవలిలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, వైద్యాధికారి ఇతర శాఖల సిబ్బంది

అభివృద్ధికి ఆమడదూరంగా పొన్నపల్లి కాలనీ

● మౌలిక వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం



పిచ్చి మొక్కలతో నిండిన కాలనీలోని రహదారి

చెరుకుపల్లి, మే 16 : పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో దాదాపు 40 ఏళ్ళుగా కాలనీ వాసులు మౌలిక వసతుల కోసం ఎదురు చూస్తున్నారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని శ్రీకారు మూరమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో జాతీయ రహదారి ప్రక్కనే 1984లో అప్పటి ప్రభుత్వం 4 ఎకరాల స్థలంలో పేదలకు నివేశన స్థలాలను పంపిణీ చేశారు. నిరుపేదలైన 132 మందికి అధికారులు పట్టాలను అందించారు. పూర్తిగా పంట పొలాలు కావటంతో పట్టాదారులు అప్పుడప్పుడు మట్టి తోలి తమ స్థలాలతోపాటు మట్టి రోడ్లను మెరక చేసుకున్నారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా పట్టాదారులు చర్యలు తీసుకున్నారు. ఒకరొకరు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. జాతీయ రహదారి అభివృద్ధి చెందటంతో కాలనీలో నివాసాలు కూడా వేగంగా ఏర్పాటు చేసుకున్నారు. పట్టాదారులే నివాసాలను ఏర్పాటు చేసుకున్నా వారికి తాగునీరు, రహదారులు, వీధి దీపాలు వంటి సౌకర్యాలను అధికారులు కల్పించలేకపోయారని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. కాలనీలో ప్రతి ఇంటి నుంచి పంచాయతీ అధికారులు ఇంటి పన్నులు వసూలు చేస్తూ తమ అభివృద్ధిని మరిచారని ఆవేదన చెందుతున్నారు. 40 ఏళ్ళుగా మట్టి కాలి బాట రోడ్లే తమకు గతి అయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం తమ కాలనీని ఎప్పుడో మరచిపోయారని వారు అంటున్నారు. పంచాయతీ ఎన్నికలప్పుడు ఏకగ్రీవం అయితే నిధులు వస్తాయని చెప్పిన స్థానిక నేతలు మా కాలనీలో అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శిస్తున్నారు. పంచాయతీ ఏకగ్రీవం అయి ఏళ్ళు గడుస్తున్నా నిధులు ఇంకా రాలేదా అని ప్రశ్నిస్తున్నారు. తాగునీటి కుళాయిలు లేక స్థానిక శ్రీ ఆంజనేయస్వామి గుడివద్ద చేతి పంపు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. వీధి దీపాలు లేక రాత్రి పూట చీకటిలో కాలనీలో నడవాలంటే భయపడుతున్నామని, విష సర్పాలు, క్రిమికీటకాలతో ముప్పు ఏర్పడుతుందని వృద్ధులు అంటున్నారు. తమ నుంచి ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు కనీసం మౌలిక వసతులు త్వరగా ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.





అభివృద్ధికి నోచుకోని పొన్నపల్లి కాలనీలోని మట్టి రోడ్లు

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

సంప్రదించండి 99854 11227 99854 02292

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

● ఎస్పీ వకుల్ జిందాల్

● సమస్యాత్మక గ్రామాలలో కొనసాగుతున్న పోలీసు పికెట్‌లు



ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మే 16 : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలలో పోలీసు పికెట్ కొనసాగుతున్నాయన్నారు. పోలీసు పికెట్ విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించమన్నారు. ఆయా ప్రాంతాలలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలకు పాల్పడితే తీసుకునే చట్టపరమైన చర్యలు గురించి, తర్వాత జరిగే పరిణామాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.. ఏ ఒక్కరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తే వారి గురించి పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని, అవాంఛనీయ ఘటనలకు ఎవరైనా పాల్పడితే వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు.

18న వాసవీమాత దివ్య రథోత్సవం

భట్టిప్రోలు, మే 16: భట్టిప్రోలులో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి దివ్య రథోత్సవాలు రెండు రోజుల పాటు జరుగుతాయని దేవస్థాన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా గురువారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 17న శుక్రవారం ఉదయం భూగర్భజలాలతో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, బిందె తీర్థం, సహస్ర కలశాభిషేకం, అమ్మవారికి అలంకరణ, కుంకుమార్చన నిర్వహిస్తారు. ఆర్యవైశ్య మహిళా కమిటీల ఆధ్వర్యంలో సహస్రనామ పారాయణం, రాత్రి అమ్మవారికి మల్లెలతో సామూహిక పూజలు, 18న శనివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, పుష్పయాగం, అమ్మవారి జయంతిని పురస్కరించుకుని సామూహిక పూజలు, సాయంత్రం అమ్మవారి దివ్య రథోత్సవం అత్యంత వైభవోపేతంగా జరుగుతాయని సాయిబాబా చెప్పారు.

యువతలో అభ్యుదయ భావాల చైతన్యం పెరగాలి

● ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి

బాపట్ల, మే 16 : యువతలో సామాజిక, సాంస్కృతిక విజ్ఞాన, అభ్యుదయ భావాల చైతన్యం పెరగాలని ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లి చైతన్య భవన్‌లో గురువారం నెలనెల విజ్ఞానం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉన్నత సమాజ నిర్మాణం కోసం విజ్ఞాన విలువలు పెంపొందించుకోవాలన్నారు. నేటి యువత మహాకవులు, తత్వవేత్తలు రచించిన గ్రంథాలను, పుస్తకాలను అధ్యయనం చేయాలన్నారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణ సామాజిక శాస్త్రాలు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం నాయకులు ఆసోది శంకర్‌రెడ్డి, ఎస్కే సుభానీ, కేవీ నారాయణ, ప్రదీప్, సిద్ధు, కుమార్, అవినాష్, సాయికృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోట వెంకటేశ్వరరెడ్డి

అంకమ్మతల్లి కొలుపులు ప్రారంభం

భట్టిప్రోలు, మే 16 : మండలంలోని కోనేటిపురం పంచాయతీ జంపనివారిపాలెంలో గ్రామదేవత అంకమ్మతల్లి కొలుపులు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి పవిత్ర కృష్ణానది జలాల్లో జువ్వలపాలెం గ్రామం వద్ద స్నానశుద్ధి తెప్పలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాక్టర్ల ద్వారా భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మేళతాళాలు, కనకతప్పెట్లు, కోలాట నృత్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి నైవేద్యాలు, మొక్కుబడులు సమర్పించుకునేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కొలుపుల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు, మొక్కుబడులు సమర్పించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలిరానున్నారు.



బురదమయంగా మారిన మూల్పూరు డొంక

అధ్వానంగా డొంక మార్గాలు

● పంట రవాణాకు ఆటంకం ● అవస్థలు పడుతున్న రైతులు



పూర్తిగా దెబ్బతిన్న జంపని డొంక

వేమూరు, మే 16: నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధి 89 గ్రామాల్లో ప్రధానమైన 59 డొంక మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో దాదాపుగా 88 వేల ఎకరాలకు సంబంధించిన రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు పండించిన పంటలను రవాణా చేసుకునేందుకు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ఈ డొంక మార్గాల నుంచి తాము పండించిన పంటలను వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించేందుకు మార్గాలు సరిలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల నుంచి నియోజకవర్గంలోని రైతులు డొంక మార్గాలను బాగుపరిచేందుకు నిధులు కేటాయించి సహకరించాలని వైసీపీ పాలకులకు విన్నవించుకున్నా ఏ మాత్రం ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే డొంక మార్గాలను బాగుపరిచేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికను రూపొందించి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించి సహకరించాలని కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

కర్లపాలెం, మే 16 : మండలంలోని నల్లమోతువారిపాలెంలో జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న బైక్‌ను వేగంగా వచ్చిన ఆటో ఢీకొందని, దాంతో తీవ్రగాయాలయ్యాయని బి.భాస్కర్ కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ రహీంరెడ్డి తెలిపారు.

అరుంధతి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

దుండిగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): అరుంధతి ఆస్పత్రిలో గుండెకు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లకు చెందిన కె. బ్లెస్సీ డిబోరా(22) అనే మహిళ గుండె మామూలుకన్నా మూడురెట్లు వేగంగా కొట్టుకుంటుంది. ఆమెను కుటుంబ సభ్యులు దుండిగల్‌లో అరుంధతి ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో వైద్య బృందం గుండె వేగాన్ని తగ్గించే వైద్య ప్రక్రియను ఉపయోగించి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా శస్త్రచికిత్స చేసిందని బ్లెస్సీ కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ ఉదయ్‌కుమార్‌ల వైద్య బృందాన్ని ఆస్పత్రి ఫౌండర్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ ధీరేన్‌రెడ్డి అభినందించారు.

నామ్ రోడ్డులో అసంపూర్తి పనులు పూర్తయ్యేదెప్పుడో..?

- దశాబ్ద కాలంగా వాహనచోదకులకు కష్టాలే
- అద్దంకిలో ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారమేది?



ఒకే రోడ్డులో రెండువైపులా వెళ్తున్న వాహనాలు .. గోపాలపురం వద్ద రెండు వైపులా వాహనాలు ప్రయాణించేలా ఏర్పాటు చేసిన డివైడర్‌లు

అద్దంకి, మే 16 : నామ్ రోడ్డులో పలు చోట్ల అసంపూర్తిగా పనులు ఉన్నాయి. దశాబ్ద కాలంగా అసంపూర్తి పనులు పూర్తి చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010 సంవత్సరంలో నార్కెట్‌పల్లి నుంచి అద్దంకి మీదుగా మేదరమెట్ల వరకు(నామ్) రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అత్యధికశాతం పనులు 2013 చివరకు పూర్తి కావడంతో 2014 జనవరిలో నల్గొండ జిల్లా మాడుగుల, ప్రస్తుత పల్నాడు జిల్లా తుమ్మలచెరువు, బాపట్ల జిల్లా ఏల్చూరుల వద్ద టోల్ గేట్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర విభన జరిగిన తరువాత నామ్ రోడ్డు 87.640 కి.మీ వరకు తెలంగాణ పరిధిలో, అక్కడ నుంచి 212.500 కి.మీ వరకు ఆంధ్ర పరిధిలోకి చేరింది. 2014 వరకు 190.380 కి.మీ దూరం రోడ్డు నిర్మాణం పూర్తి కాగా, అనంతరం 2021 వరకు 13.425 కి.మీ దూరం అసంపూర్తి పనులు పూర్తి చేశారు. బాపట్ల జిల్లా పరిధిలో అద్దంకి పట్టణంతో పాటు, మండలంలోని గోపాలపురం, చక్రాయపాలెం, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు వద్ద రోడ్డు నిర్మాణ పనులు సుమారు దశాబ్ద కాలం గా పూర్తి కాలేదు. ఆయా ప్రాంతాలలో భూసేకరణ పూర్తి కాకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులకు అడ్డంకులు తొలగలేదు. పరిహారం కోసం పలు సందర్భాలలో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు రోడ్డెక్కారు. అయినా పరిహారం చెల్లించకపోగా, దశాబ్ద కాలంగా పనులు అసంపూర్తిగా ఉన్నా అధికారులు సైతం పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. రాష్ట్ర విభజన జరిగినా, జిల్లాల పునర్విభజన జరిగినా, ప్రభుత్వాలు మారినా అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు మాత్రం పూర్తి చేయడంపై దృష్టి సారించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్న చోట తరచూ రోడ్డు మరమ్మతులకు గురవుతున్నా మరమ్మతులు మొక్కుబడిగా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



గోపాలపురం వద్ద నిర్మాణం చేయకుండా వదిలివేసిన నామ్ రోడ్డు

నిత్యం ట్రాఫిక్ జామ్

ఇక అద్దంకి పట్టణంలో అప్పట్లో అలైన్‌మెంట్ మార్పు చేసి రోడ్డు విస్తరణ పనులు మొక్కుబడిగా చేశారు. భవానీ సెంటర్‌లో ఎలాంటి విస్తరణ పనులు చేపట్టకుండానే గాలికి వదిలేశారు. ఇక బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు గాలికి వదిలేశారు. దీంతో అద్దంకి పట్టణంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా భవానీ సెంటర్‌లో ఐదు రోడ్ల కూడలి కావడంతో అన్ని వైపుల నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ నిలిచిపోతుంది. ట్రాఫిక్ ఐ లాండ్ కూడా లేకపోవడంతో వాహనాలు అడ్డదిడ్డంగా రోడ్డు దాటుతుండడం ట్రాఫిక్ జామ్‌కు ప్రధాన కారణంగా నిలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నామ్ రోడ్డులో అసంపూర్తి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



కల్యాణ ప్రతికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

స్వామివార్ల కల్యాణ పత్రిక ఆవిష్కరణ

చెరుకూరు(పర్చూరు), మే 16 : పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్తేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవానికి సంబంధించిన కల్యాణ పత్రికను గురువారం ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల సమక్షంలో అర్చక స్వాములు కల్యాణ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణ కార్యదర్శి ఎం.నాగయ్య మాట్లాడుతూ స్వామివార్ల కల్యాణ వేడుకలను ఈనెల 23న నిర్వహించే విధంగా అర్చక స్వాములు నిర్ణయించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. స్వామివార్ల కల్యాణ వేడుకల్లో భాగంగా ఆలయంలో ఈనెల 19 నుంచి 25వరకు పలు కార్యక్రమాలు జరగుతాయన్నారు. కార్యక్రమంలో అర్చక స్వాములు నల్లూరి సీతారామాచార్యులు, కృష్ణమాచార్యులు, కంచిబొట్ల శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఆరాధన మహోత్సవాలు



వీరబ్రహ్మేంద్రస్వామివారు

ఇంకొల్లు, మే 16 : ఇంకొల్లులో కాలజ్ఞానతత్వ మహిమాన్విత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారి జెండా ఊరేగింపు, శుక్రవారం నాగుల చెరువు వద్ద ఉన్న స్వామివారి ఆలయంలో ఆరాధన మహోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు మచ్చు నాగేశ్వరరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

అద్దంకిటౌన్, మే 16 : అద్దంకిలోని కాకానిపాలెంలోని రేణంగివరం రోడ్డులోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీ రబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నందు శుక్రవారం స్వామివారం 331వ ఆ రాధన మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు చెన్నుపల్లి శ్రీనివాసచారి గురువారం ఒ క ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుండి పూజా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని భక్తులు అందరు పూజా కార్యక్రమాలల్లో పాల్గొనపాలని కోరారు.

సర్వీసులు సక్రమంగా నడపండి


ఇంకొల్లు, మే 16 : ఇంకొల్లు నుంచి ఒంగోలు నడిపే బస్సు సర్వీసులను ప్రజలకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా నడపాలని ఒంగోలు డిపో మేనేజరు ధర్మవరపు శ్రీనివాసులుకు విన్నవించారు. గురువారం జరిగిన డైల్‌యువర్ డీఎం కార్యక్రమంలో ఇంకొల్లు ప్రాంత ప్రయాణికులు డీఎంతో ఫోన్‌లో సమస్యలను విన్నవించారు. ఒంగోలు వయా రాచపూడి మీదగా హైదరాబాద్, తిరుపతి సర్వీసులు నడపాలని, సాయత్రం 6 గంటల తరువాత ఒంగోలు సర్వీసులు సమయపాలన సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

కోటేశ్వరరావును పరామర్శించిన గొట్టిపాటి



కోటేశ్వరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న గొట్టిపాటి

అద్దంకి, మే 16 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కోటేశ్వరరావును ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ గురువారం పరామర్శించారు. అద్దంకి పట్టణంలోని 20వ వార్డుకు చెందిన నంబూరి కోటేశ్వరరావు ఈ నెల 14వ తేదీన రామాంజనేయపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నర్సరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే గొట్టిపాటి గురువారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట టీడీపీ నేతలు కరి పరమేష్, కోనేటి అనిల్, గుంజి గోవిందు, ఏసోబు ఉన్నారు.



రక్తనాళ సంబంధిత వ్యాధుల నిపుణులు ఒంగోలు రాక
12 సంవత్సరాల అపార అనుభవము కలిగిన బృందం నుండి
డా. నరేంద్రనాద్ మేడా వారి వైద్య బృందం నుండి
డా॥ బి. విశాల్
MBBS, DNB, M.Ch, (Vascular Surgery, MMC, Chennai)
Consultant Vascular & Endovascular Surgeon
ఈ నెల తేది. 19-05-2024, ఆదివారం
ఉ॥ 10గం॥ నుండి సా॥ 4గం॥ వరకు అందుబాటులో ఉంటారు
KIMS HOSPITALS™
కిమ్స్ హాస్పిటల్
NH-5, నార్త్ బైపాస్ రోడ్డు, ఒంగోలు.
అపాయింట్‌మెంట్ కొరకు
08592 - 667788, 70958 78686

రుణం.. తీర్చలేని భారం..!

- యాప్ ఉచ్చులో పడి సర్వం పోగొట్టుకున్న బాధితులు
- మరెవ్వరూ బలికావద్దని వేడుకోలు
- నష్టపోతారని పోలీసుల హెచ్చరిక

చీరాల, మే 16 : రుణ యాప్‌ల జోలికి వెళ్లొద్దు. ఆ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దు. తీసుకుంటే దారుణంగా నష్టపోతారని బాధితులు, పోలీసులు చెప్తున్నారు. గతంలో ఆ యాప్‌ల ద్వారా రుణాలు పొందినవారు తమ అనుభవాలను చెప్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరెవ్వరూ ఆ యాప్ వలలో చిక్కుకోవద్దని సూచిస్తున్నారు.

రుణ యాప్‌ల నిర్వాహకులు ముందస్తుగా డబ్బు అవసరం ఉన్న పేద, మధ్యతరగతి వారిని, ఉద్యోగాల కోసం వెదుక్కుంటున్నవారిని, రుణం కోసం ప్రయత్నిస్తున్నవారిని గుర్తిస్తారు. వారి సెల్‌ఫోన్లు ఆ యాప్‌ల నిర్వాహకులు తమ యాప్‌ల ద్వారా రుణాలు పొందేందుకు సులువైన మార్గమని నమ్మించే విధంగా పోస్టులు పెడతారు. అవసరంలో ఉన్నవారు రుణం పొందాలనే తొందర్లో వారు చెప్పే అన్ని రకాల నిబంధనలకూ ఒప్పుకుంటారు. ఆ క్రమంలో తమ ఫోన్ కాంటాక్ట్ నెంబరు, ఫొటోలు తదితరాలు వారు ట్రాక్ చేసుకునే విధంగా అంగీకారం కోరతారు. రుణం తీసుకునే ఆత్రుతలో ఇవన్నీ సాధారణమని ఓకే చేస్తారు. వారు ఇచ్చే రుణం, తిరిగి చెల్లించాల్సిన వ్యవధి తక్కువగా ఉంటుంది. వడ్డీ అధికంగా ఉంటుంది. ఉదాహరణకు రూ.10వేలు రుణం ఇస్తుంటే ముందుగానే రూ.2వేలు తగ్గించుకుని రూ.8వేలు మాత్రమే ఇస్తారు. రుణం చెల్లించాల్సిన కాలపరిమితిలో చెల్లించకుంటే ఇక వారి టార్చర్ మొదలవుతుంది. ఫోన్‌లోని నెంబర్ల ద్వారా తెలిసిన వారు దగ్గర వారి పరువుతీసే విధంగా మాట్లాడతారు. వేరెక్కడైనా రుణం తీసుకుందామన్నా, అది తెలుసుకుని అక్కడ కూడా చెడుగా చెప్తుంటారు. ఈ క్రమంలో తమ యాప్ ద్వారానే మరో లోన్ ఇంకాస్త పెద్దమొత్తంలో ఇచ్చేందుకు అవకాశం ఉందని చెప్తూ, ఆ వైపు ఆకర్షితులయ్యే విధంగా ప్రేరేపిస్తారు. ఆ లోన్ తీసుకుని ముందు తీసుకున్న లోన్ క్లియర్ చేసిన తరువాత మరలా కాలపరిమితి దాటగానే టార్చర్ మొదలవుతుంది. దీంతో కొందరు ఆ టార్చర్‌ను భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవరు కూడా రుణయాప్‌ల ద్వారా రుణాలు పొందవద్దని బాధితులు చెప్తున్నారు. పోలీస్‌శాఖ పరంగా కూడా హెచ్చరిస్తున్నారు.



కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి

చినగంజాం, మే 16 : శాఖ గ్రంథాలయం వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు అన్నారు. శాఖ గ్రంథాలయంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదవే విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణతరగతులను ప్రారంభించారు. విద్యార్థులకు ఇంగ్లీషు రాయడం, చదవడం, కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్నట్లు గ్రంథపాలకుడు ఎంఎల్ నరసింహాచార్యులు తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు 8885757594 సెల్ నెంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఉపాధ్యాయులు వై.రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

పరామర్శించిన ఎమ్మెల్యే ఏలూరి



సురేష్ మృతదేహం వద్ద విషన్నవదనంతో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మే 16 : మండలంలోని రాజుగారిపాలెం లో తెలుగుదేశం పార్టీ కార్యకర్త, మార్టూరులోని హీరో షోరూం యజమాని శ్రీనివాసరాజుకు సోదరుడైన కల్లేపల్లి సురేష్ రాజు (40) అనే యువకుడు గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాత్రి సమయంలో ఇంటిలో అస్వస్థ తకు గురైన సురేష్‌ను కుటుంబ సభ్యులు కారులో మార్టూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతనిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. దాంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకు వచ్చారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాజుగారిపాలెం వెళ్లి సురేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రెండు రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో రాజుగారిపాలెంలో తెలుగుదేశం పార్టీ గెలుపునకు పార్టీ కార్యకర్తగా సురేష్ విశేషంగా కృషి చేశారు. చిన్న వయస్సులో సురేష్ మృతి చెందడం వారి కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అన్నారు. సురేష్ రాజుగారిపాలెంలోని టీడీపీ నేత మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజుకు దగ్గర బంధువు కావడం, అంతేగాకుండా మార్టూరులో హీరో షోరూంలో పని చేస్తూ పలువురు పరిచయాలు ఉండడంతో మండలంలోని టీడీపీ శ్రేణులు షేక్ రజాక్, కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణలతో పాటు మార్టూరు లోని పలువురు వ్యక్తులు సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సంతాపం తెలియ చేశారు.

డెంగ్యూ నివారణకు అందరూ సహకరించండి



చీరాల ఏరియా వైద్యశాల వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

చీరాలటౌన్, మే 16 : డెంగ్యూ వ్యాధి నివారణకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీరాల ఏరియా వైద్యశాల పీపీపీ యూనిట్ వైద్యాధికారి డా.వై.యాకోబు అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినం కార్యక్రమాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల వద్ద సిబ్బంది నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రధాన రహదారులలో నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ పరిసరాల్లో వ్యర్థాల నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ ఇతర నిల్వలతో ప్రమాదం పొంచి ఉన్నట్లు చెప్పారు. దోమల లార్వాను విధిగా తొలగించాలన్నారు. టైర్లు, కొబ్బరి చిప్పలు, మురుగు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. డెంగ్యూ లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో డా.ప్రణయ్ నంద, డా.ప్రణయ్‌కుమార్, పట్టణ మలేరియా అధికారి చింతా శేషుబాబు, ఈపూరుపాలెం పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో డా.జ్యోతిర్మయి, సూపర్‌వైజర్‌లు గాలిబ్, మార్త ఎల్‌టీ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చినగంజాం : డ్యెంగూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చినగంజాం, సంతరావూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, బి.నాగేంద్ర అన్నారు. డెంగ్యూ దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది డ్యెంగూ వ్యాధిపై చినగంజాంలో సంతరావూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సంతరావూరు, కడవకుదురు గ్రామాల్లో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శుక్రవారం డ్రైడే-డ్రైడే పాటించటం ద్వారా డెంగ్యూవ్యాధిని, వాటికి కారణమైన డెంగ్యూ దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం, పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.సాయిశ్రీ చరణ్, వై.భవాని, పీ.హెచ్ఎన్ బేబి, హెల్త్ సూపర్ వైజర్లు చిరంజీవి, ఉల్దారాణి, ల్యాబ్ టెక్నిషియన్‌లు శ్యామ్ సుందర్‌బాబు, సుధా, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, హెచ్‌వీ వరదానం, హెచ్‌వీ మాధవి, హెల్త్ అసిస్టెంట్ విజయప్రసన్న, స్టాఫ్ నర్స్ ఉదయలక్ష్మి, మురళి, మహేష్, పీ.సుబ్బారావు, కావ్య, సింగయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే నివారణ

అద్దంకిటౌన్ : సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారిద్దాం అని యూపీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ గొట్టిపాటి జయసింహ అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ దినం సందర్భంగా అద్దంకి పట్టణంలోని గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీలో వైద్య సి బ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జయసింహ మాట్లాడుతూ దోమకాటుతో కలిగే ప్రమాదాలపై ప్రతి ఒక్క రూ అవగాహన కలిగి ఉండాలన్నారు.



మేదరమెట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వీ వెంకాయమ్మ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

మేదరమెట్ల : వాడకుండ ఉండే పాత్రలు, కొబ్బరి చిప్పలు, పాత తొట్టెలలో నీరు నిల్వ లేకుండా చేసుకోవడం డెంగ్యూ నివారించుకోవచ్చారు. గురువారం డెంగ్యూ దినం సందర్భంగా మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిఖిలారెడ్డి, డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ నికిలారెడ్డి మాట్లాడుతూ ఇళ్లల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కువ రోజులు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కౌలు వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఆలయ భూముల కౌలు వేలం

పెరిగిన ఆదాయం

పంగులూరు, మే 16 : పంగులూరులో ఆలయ భూములకు కౌలు వేలం జరిగింది. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం దేవదాయ శాఖ అధికారులు నిర్వహించిన కౌలు వేలంలో పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 14 ఎకరాల 34 సెంట్ల భూమికి గతంలో రూ.93వేలకు కౌలు చెల్లించగా ఈ ఏడాది లక్షా 19 వేలకు, శ్రీ వాలేశ్వరస్వామి ఆలయానికి చెందిన 25 ఎకరాల విస్తీర్ణానికి గతంలో రూ.2 లక్షల 64 వేల కౌలు చెల్లించిన రైతులు ఈ ఏడాది 4 లక్షల 65 వేలకు, శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 47 ఎకరాల 28 సెంట్ల విస్తీర్ణానికి గతంలో రూ.6లక్షల70 వేల కౌలు చెల్లించిన రైతులు ఈ ఏడాది రూ.12లక్షల51 వేల కౌలుకు భూములు దక్కించుకున్నారు. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో కోటిరెడ్డి, పంగులూరు గ్రూప్‌నకు చెందిన ఈవో ఉప్పలమర్తి శ్రీనివాసరావు, తాళ్లూరు ఆలయ గ్రూప్‌నకు చెందిన ఈవో గుంటుపల్లి వాసుబాబు ఆధ్వర్యంలో జరిగిన కౌలు వేలంలో ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ బాచిన (అబ్బయ్యగారి) వెంకటేశ్వర్లు, పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ ఏడాది దేవదాయ భూములు కౌలు వేలంలో 8 లక్షల 8వేల అదనపు ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు.

దేవదాయ భూముల కౌలు బహిరంగ వేలం

చెరుకూరు (పర్చూరు), మే 16 : పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అస్తేశ్వర స్వామివారి దేవస్థాన భూముల కౌలు బహిరంగ వేలం గురువారం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు పర్యవేక్షణలో జరిగింది. ఈ ఆలయానికి సంబంధించి మొత్తం 100 ఎకరాల 18 సెంట్లకు బహిరంగ వేలం నిర్వహించారు. అందులో 45.93 సెంట్ల భూమిని మాత్రమే గ్రామస్థులు పాడుకున్నారు. మిగిలిన భూమికి తదుపరి పాట నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. 45 ఎకరాల 93 సెంట్లకు రూ.7,46,300 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.నాగయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం



విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకిటౌన్, మే 16 : అద్దంకి శాఖ గ్రంథాలయలో ఈ నెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు చుండూరి సుగుణరావు తెలిపారు. గురువారం గ్రంథాలయంలో నిర్వహించిన విజ్ఞాన శిబిరంలో సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు అతిథిగా వచ్చి విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కథలు చదివించడం, ఆటలు ఆడించడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, మ్యూజిక్, క్యారమ్స్, ఇతర అంశాలను నేర్పిస్తామని సుగుణరావు తెలిపారు. 10 నుంచి 15 సంవత్సరాలలోపు వయస్సు విద్యార్థులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. చేరేవారు గ్రంథాలయంలో సంప్రదించాలని గ్రంథపాలకుడు కోరారు.

బస్సు దగ్ధం ఘటనపై విష ప్రచారం

- సీఎం పత్రికలో తప్పుడు కథనం
- ఖండించిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు

పర్చూరు, మే 16 : ప్రమాదం జరిగి కుటుంబాలు శోకసంద్రంలో ఉంటే సానుభూతి తెలపాల్సిన పరిస్థితుల్లో సంఘటనపై విషప్రచారం చేయడం పత్రికల విలువను దిగజార్చడమేనని జడ్పీటీసీ మాజీ సభ్యుడు, సీనియర్ నాయకుడు కొల్లా సుభాష్ బాబు అన్నారు. పల్నాడు జిల్లా, చిలకలూరిపేట మండలం పసుమర్రు సమీపంలోని ఈపూరువారిపాలెం వద్ద బస్సు దగ్ధమైన సంఘటనపై సీఎం పత్రికలో వచ్చిన దుష్ప్రచార వార్తపై ఆయన స్పందించారు. బాధ్యతతో సొంత ఊరిలో ఓటువేసుకొని తిరుగు ప్రయాణం చేస్తూ దురదృష్టవశాత్తు బస్సు దగ్ధమైన సంఘటనలో సజీవదహనం కావడం బాధాకరమన్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాలకు సానుభూతి ప్రకటించి ఓదార్చాల్సిన పరిస్థిల్లో ఇలా తప్పుడు రాతలు రాయడం దారుణమన్నారు. నోవా అగ్రిటెక్ ప్రొటెక్ట్‌కు సంబంధించి ఏమైన ప్రమాదకరమైన రసాయనాలు తరలించారా అని అనుమానాలను రేకెత్తించే విధంగా అసత్య వార్తలు రాయడాన్ని ఖండించారు. వ్యవసాయ సీజన్ ముగిసి మూడు నెలలైందని, ఈ సమయంలో వీటిని తీసుకువెళ్లడం ఏమిటనేది వారికే తెలియాలన్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు గాలిలో కలసి పోయాయన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పోలూరు వాగు వస్తే తూముల చప్టాపై ప్రమాదమే

20 ఏళ్లుగా ప్రయాణికులకు తప్పని కష్టాలు

యద్దనపూడి, (మార్టూరు) మే 16 : యద్దనపూడి మండలంలో వాగులు వరదలు వచ్చినపుడు పోలూరు వాగుపై ఉన్న తూముల చప్టాపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంటుంది. వాస్తవంగా ఆ సమయంలో పోలూరు గ్రామానికి యద్దనపూడి మండలానికి ప్రజల రాకపోకలు నిలిచి పోతాయి. వర్షాకాలంలో చప్టాకు ఎగువ నుంచి ఉధృతంగా వాగునీరు వస్తుంది. దాంతో చప్టాపై నుంచి ప్రజలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. పోలూరు గ్రామం నుంచి రైతులు పొలాలకు వెళ్లడానికి, గ్రామం నుంచి యద్దనపూడి మండలంలోని మిగతా గ్రామాలకు వెళ్లేందుకుగత 20 ఏళ్ల క్రితం ఈ చప్టాను నిర్మించారు. అప్పటి నుంచి గ్రామస్థులకు కొంత ఊరట కలిగినప్పటికీ తూముల చప్టా స్థానంలో భారీగా వంతెన బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్థులు పలుసార్లు అధికారులను కోరడం జరిగింది. ఇప్పటికే చప్టాపై వాగునీటిని దాటుతూ గతంలో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వాగులో కొట్టుకుపోయి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు జరిగాయి. ఈ సమయంలో అధికారులు హడావుడి చేయడం, తూముల చప్టా స్థానంలో వంతెన బ్రిడ్జిని నిర్మించాలని ప్రజా ప్రతినిధులు ప్రయత్నాలు చేయడం జరుగుతుంది. 2014లో నాబార్డు నుంచి అధికారులు బ్రిడ్జిని నిర్మించడానికి ప్రతి పాదనలు కూడా చేశారు. కానీ బ్రిడ్జి నిర్మాణం కార్య రూపం దాల్చ లేదు. వర్షాలు భారీగా కురిసినపుడు వాగులలో నీటి ప్రవాహం పెరిగిన సమయంలో పోలీసులు రెవెన్యూ అధికారులు చప్టా వద్ద బందోబస్తు నిర్వహించడంతో తాత్కాలికంగా ప్రమాదం జరగకుండా చర్యలు చేపడుతున్నారు. కాని భవిష్యత్‌లో శాశ్వతంగా వంతెన బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు కోరుతున్నారు. అదీగాక ప్రస్తుతం ఉన్న తూముల చప్టా కూడా శిథిల దశకు చేరడంతో వాటి తూములు పూర్తిగా శిథిలమయ్యే దశకు చేరేలోపు కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



పోలూరు వాగుపై ఉన్న తూముల చప్టా